POSTAL REGD.NO.PRAKASAM/16/2024-2026
REGD.NO. 37926/83
ESTABLISHED : 1983

**ఆగస్టు 2025**

వెల – ₹ 10.00

# సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

సంపుటి: 43 సంచిక: 04



## శ్రీ రామకృష్ణ పరమహంస ఆరాధన

ఆగస్టు 16, 2025

# ఈ నెల పండుగలు

ఆగస్టు 10 - శ్రీ సిద్ధారూఢ స్వామి ఆరాధన

ఆగస్టు 16 - శ్రీకృష్ణ జన్మాష్టమి

ఆగస్టు 16 - శ్రీ రామకృష్ణ పరమహంస ఆరాధన

ఆగస్టు 17 - శ్రీ తాజుద్దీన్ బాబా ఆరాధన


ఆగస్టు 24 - అవధూత శ్రీ వెంకయ్య స్వామి ఆరాధన

ఆగస్టు 27 - వినాయక చవితి

ఆగస్టు 27 - శ్రీ శ్రీపాద శ్రీవల్లభ స్వామి జయంతి (భాద్రపద శుద్ధ చవితి)

ఆగస్టు 27 - శ్రీ ఆనందమయి అమ్మ ఆరాధన

ఆగస్టు 28 - శ్రీ గజానన్ మహరాజ్ ఆరాధన (భాద్రపద శుద్ధ పంచమి)



# సాయిచర్యలు – ధర్మానికి దీపాలు

*పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ*

వెలుగు గురించి కొన్ని గంటలు ఉపన్యసించినా కొంచెము గూడా వెలుగు రాదు. స్విచ్ వేసినా, అగ్గిపుల్ల గీచినా తృటిలో వెలుగు వస్తుంది. చుట్టూవున్న చీకటి తొలుగుతుంది. అలానే ఎన్ని శాస్త్రగ్రంథాలు చదివినా, మన మెన్ని ఉపన్యాసాలు యిచ్చినా కలగని జ్ఞానం – శ్రీ సాయిబాబావంటి సద్గురువుచేసే ప్రతిచిన్న చర్యలోనూ సర్వధర్మాలు, శాస్త్రాలూ భాసిస్తాయి. మనం గ్రంథాలు చదువుకోవాలన్నా వెలుగు కావాలి. అలానే సద్గురువుయొక్క చర్యలు విరజిమ్మే వెలుగులో మనం చదివే శాస్త్రాలు మనకు సరిగా అర్థం అవుతాయి.

అంతేకాదు. ఒకే వెలుగులో ఒకే శాస్త్ర గ్రంథాన్ని నలుగురు చదువుకుంటే అది వారిలో ఒక్కొక్కరికీ ఒకొక్క విధంగా అర్థం అవుతుంది. అది సంపూర్ణంగా అర్థం అవ్వాలంటే నిరంతర సద్గురు సేవవలన మన మనస్సు ప్రబుద్ధం కావాలి. లోజూపు అనే జ్ఞానజ్యోతి వెలగాలి.

ఒక రోజు ఒకామె జామపండ్లమ్ముతోంది. సాయి ఆమెను పిలచి బేరమాడారు. పట్టుబట్టి పదణాలకు (అరవై పైసలకు) ఆరు పండ్లు యివ్వడానికి ఆమెను ఒప్పించారు. ఇంతలో యింకొకామెకూడా జామపండ్లను తెచ్చి సాయిని కొనమని కోరింది. సాయి ఆమెతో బేరమాడి ఆరు అణాలకు (ముప్ఫయి ఆరు పైసలు) పది పండ్లు యివ్వమన్నారు. ఆ యిద్దరివద్ద పండ్లు తీసుకుని యిద్దరికీ చెరొక రూపాయి యిచ్చి పంపారు!

సాయి వారిద్దరితో బేరమాడుతుంటే చూచిన భక్తులు మొదట ఆయనెంత పిసినారో అని తలచి ఆశ్చర్యపోయారు. ఆయన చెరొక రూపాయి యిచ్చేసరికి మరింత ఆశ్చర్యపోయి కారణ మడిగారు. "మొదటి స్త్రీ పండ్లు తెచ్చినప్పుడు ఆమెవద్ద తప్ప పండ్లు దొరకక పోవడంవలన వాటికా వెల నిర్ణయించబడింది. రెండవామె పండ్లు తెచ్చేసరికి పండ్లు అధికంగా దొరుకుతున్నాయి గనుక వాటికి ఆ వెల నిర్ణయించబడింది. గానీ, చివరకు వారిద్దరూ వారి పుణ్యాన్ని అనుసరించి ప్రతిఫలాన్ని పొందారు" అన్నారు సాయి.

సాయి చర్యలన్నిటిలోలాగే ఇందులో కూడా తెలుసుకున్న వారికి తెలుసుకున్నంత జ్ఞానమున్నది. మొదటి స్త్రీ సాయి వద్ద సాధ్యమైనంత డబ్బును లాభంగా పొందాలని మాత్రమే వచ్చింది. అందుకే అంత బేరమాడింది. రెండవ స్త్రీ సాయి మహాత్ములని, కనుక ఆయనకోరిన వెలకు పండ్లివ్వాలని, ఆయనిచ్చిన పైకం ప్రసాదమేనని తలచింది. అందుకే ఆ బేరానికి ఒప్పుకున్నది. భక్తులందరి పైన సాయి అనుగ్రహం ఒక లాగానే ఉంటుంది. కాని ఎవరి శ్రద్ధనుబట్టి వారంతే పొందుతారు. బేరం దృష్ట్యా చూస్తే మొదటి స్త్రీకి లాభం తక్కువ. ఆమె కోరిన వెలకంటే అదనంగా ఆమెకు లభించింది నలభై పైసలే. రెండవ స్త్రీ పొందినది ఎక్కువ. ఆమెకు అరవై నాలుగు పైసలు ఎక్కువ లభించాయి.

ఈ లీల యింకా విశాలమైన సూక్ష్మాన్ని తెల్పుతుంది. భగవంతుడిని మానవులు నాలుగు విధాలుగా ఆశ్రయిస్తారు. కష్టాలను తొలగించమనేవారు, కోరికలు తీర్చమనేవారు, ఆయన మహిమలు తెలుసుకోదలచినవారు, పూర్ణమైన జ్ఞానాన్ని మాత్రమే కోరేవారు. అంటే మొదటి రెండు రకాలైన

*మిగతా 21వ పేజీలో*

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

# సాయిబాబా

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సంపుటి:43 ఆగస్టు - 2025 సంచిక:04

***పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిచే స్థాపించబడిన ఏకైక పత్రిక, మన "సాయిబాబా"***

## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 01. | సాయిచర్యలు- ధర్మానికి దీపాలు | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 03 |
| 02. | పరిప్రశ్న | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 05 |
| 03. | సద్గుర్వనుగ్రహము | పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ | 06 |
| 04. | మాతృదేవి స్మృతులు | శ్రీ యోగ నాగేంద్ర | 09 |
| 05. | గుమ్మళంపాడు లో గురుపూర్ణిమ మహోత్సవం | శ్రీమతి టి. పద్మావతి | 13 |
| 06. | వార్తాలాపము | శ్రీమతి అడిదం వేదవతి | 16 |
| 07. | బుద్ధ ధ్యాన హృదయము | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 18 |
| 08. | భగవాన్ శ్రీ భరద్వాజ | శ్రీమతి శ్రీదేవి | 19 |
| 09. | శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు | శ్రీమతి శ్రీదేవి | 22 |
| 10. | ద్వారకామాయి అనుభవమండపము | శ్రీమతి వణుకూరి వాణీకుమారి | 25 |
| 11. | ఆచార్యుని అద్భుత లీలలు | శ్రీ జానకిరామిరెడ్డి | 27 |


చిరునామా

Sri Manga Bharadwaja Trust,
Kondaiah Bunk Street, Kothapeta,
Ongole, Prakasam District, A.P. - 523002
Phone No. 08592 233271
**www.saibharadwaja.org**

చీఫ్ ఎడిటర్: డా॥ ఆర్.ఎస్. శశిధర్, పిహెచ్. డి

చందా వివరములు

విడి ప్రతి : ₹ 10-00
సంవత్సర చందా : ₹100-00

సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.

# పరిప్రశ్న

**పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ**

**ప్రశ్న :- త్రైలింగస్వామి వంటి మహనీయులు ఈ దేశంలో గుర్తింపులేక కాశీ వెళ్ళిపోయారని వ్రాశారు. అటువంటి మహనీయులకు, మన దేశం నుండి విదేశాలకు వెళ్ళిపోతున్న నేటి శాస్త్రజ్ఞులకు భేదం ఏమిటి ?**

**-విద్యానగరు, మీ పాఠకురాలు**

**జవాబు :-** ఇటు పూర్ణుడైన సద్గురువును, అటు విశ్వకర్త, భర్త అయిన పరమాత్మనూ సక్రమంగా సేవించి పరమార్థం సాధించుకొనే వారి నుద్ధరించడానికే శ్రీదత్తాత్రేయస్వామి మహనీయుల రూపాలలో అవతరిస్తాడు. ఎక్కడ యీ సత్సాంప్రదాయం తెలియక మహనీయుల సాన్నిధ్యాన్ని సార్థకం చేసుకునేవారుండరో ఆ ప్రాంతం విడిచి, యీ సత్సాంప్రదాయం తెలిసి వినియోగించుకునేవారుండే ప్రాంతాలకు వెళతారు. ఈ సాంప్రదాయాన్ని వారే తెలుపుకుంటే మందబుద్ధులు అది ఆత్మస్తుతిగా తలుస్తారుగాని అర్థంచేసుకోరు. ఈ కారణంగానే మన రాష్ట్రంలో అవతరించిన శ్రీపాద శ్రీవల్లభులు గూడా యీ ప్రాంతాన్ని విడిచి ఆ సాంప్రదాయం అమలులోనున్న మహారాష్ట్రానికి వెళ్ళారు. మహనీయులు ఎక్కువ లోకహితం చేయగలందులకు వెడతారు. వైజ్ఞానిక శాస్త్రవేత్తలలో ఎక్కువమంది స్వలాభం కోసం వెడుతున్నారు. అదీ తేడా! ●

**ప్రశ్న :- మానవుడే దేవుడని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. ఇక మానవుడికి దైవాన్వేషణ ఎందుకు ?**

**– చి॥ లత, ఉదయగిరి**

**జవాబు :-** శాస్త్రాలు ఘోషించినది మానవుడు దైవమనిగాదు, ఆత్మ దైవమని, దీనిని వివరిస్తాను.
నీరు దైవమనుకుంటే అందులోని అలలు జీవులు. అనంతకోటి జీవులలో మానవులొక వర్గమే. ఇపుడు అల తన గురించి తాను రెండు భావాలు కల్గియుండవచ్చు. ఒకటి తాను అలను మాత్రమేనని, రెండు తాను నీరని. అలగా చూస్తే ప్రతి అల తక్కిన అలలకంటే భిన్నమే. నీరుగా చూస్తే అన్నీ ఒక్కటే. అల అనేది నీరు ధరించే రూపమే. దానికి ఉత్పత్తి, వృద్ధి, స్థితి, లయము అనే మార్పులుంటాయి. అది అశాశ్వతము, పరిమితము. నీరు శాశ్వతము, సర్వగతము, ఆకార రహితము మరియూ ఎన్ని ఆకారాలైనా ధరించగలది గూడ. అలల పుట్టుకతో అది ఉద్భవించదు. అలల నాశంతో అది నాశనమవదు. అల మనిషి, నీరు దైవము. నేను మానవుణ్ణి అనుకోవడం నేను అలను అనుకోవటం లాంటిది. ఇదే అజ్ఞానం. నేను 'నీరు' అని గుర్తించడంలాంటిది 'నేను పరమాత్మను' అన్న జ్ఞానం. నేను మానవుణ్ణి అన్న స్థాయిలో మనముంటే అదే బంధము. అజ్ఞానము, మాయ. దానినే ధ్యానాదుల ద్వారా, సద్గురుకృప ద్వారా అతిక్రమించి జ్ఞానం పొందడమే పరమావధి.●

*(ఫిబ్రవరి 2010 సాయిబాబా మాసపత్రిక నుండి)*

# సద్గుర్వనుగ్రహము

***పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ***

ఫిబ్రవరి తొమ్మిది. పూజ్యశ్రీ ఆచార్య భరద్వాజ మాస్టరుగారిని ఆరాధించేవారందరికీ అతి ముఖ్యమైన, ప్రీతికరమైన రోజు. కారణం ఆ రోజు పూజ్యశ్రీ మాస్టరుగారు శిరిడీలో లేకుంటే, శిరిడీ సాయిబాబా వలన అట్టి అనుభవాన్ని పొందకుంటే ఈ రోజు మనమిలా సాయిని సేవించేవాళ్ళము కాదేమో!

ఆ రోజు పూజ్యశ్రీ మాస్టరుగారు, శిరిడీ సాయిబాబా యొక్క పరిపూర్ణ అనుగ్రహాన్ని పొందిన రోజు. శిరిడీ సాయి సన్నిధిలో ఆయన ఆత్మానుభవాన్ని పొందినరోజు. ఆ క్షణం నుంచి ఆయన మనసా, వాచా, కర్మణా శ్రీ సాయినాథునికి అంకితమై ఆయన మహిమను దశదిశలా వ్యాపింపజేసారు.

ప్రథమ దర్శనంలోనే ఆయన అంతగా సాయినాథుని అనుగ్రహాన్ని ఎలా పొందగలిగారు? దానికి కారణాలేమిటి? అంటే అప్పటివరకూ పూజ్యశ్రీ మాస్టరుగారు చేసిన అన్వేషణ, సాధనలు ఫలించి ఆయనకు సాయి అనుగ్రహం లభించిందని ఒక్క మాటలో చెప్పుకోవచ్చు.

నిజానికి ఆయన చిన్నప్పటినుండీ అన్వేషకులే. చిన్నప్పుడు మాతృదేవి మరణంతో ప్రారంభమైన అన్వేషణ ఆయన అన్నగారి అబ్బాయి మరణంతో తీవ్రతరమైంది. దానితో ఆయన బుద్ధునివలెనే జనన మరణ చక్రాన్ని, సృష్టి తత్వాన్ని తరచి తరచి తెలుసుకున్నారు.

పూజ్యశ్రీ మాస్టరుగారు మొదటినుంచీ ఏ విషయాన్నైనా క్షుణ్ణంగా తెలుసుకోనిదే వదిలి పెట్టేవారుగాదు. అన్ని విషయాలలోనూ ఆయనకు ప్రశ్నల చిట్టా వుండేది. సమాధానపడేవరకూ వదిలి పెట్టేవారుగాదు.

అందుకనే అసలు ఆధ్యాత్మికత అంటే ఏమిటి? ఆధ్యాత్మిక తత్త్వవేత్తలు ఎలా వుంటారు? భగవంతుడు వున్నాడా? ఉంటే ఎలా వుంటాడు? ఆయన తత్త్వమేమిటి? అని తెలుసుకోవడానికి ఎన్నో పుస్తకాలు చదివారు. ఆలోచించారు.

అసలు మతమంటే ఏమిటి? మతాలు ఎలా ఉద్భవించాయి? ఇన్ని మతాలు ఎందుకు ఏర్పడ్డాయి? అవి బోధించేదేమిటి? ఇవి తెలుసుకోడానికి మతాలగూర్చి అన్ని గ్రంథాలు చదివారు. వాటి తత్త్వాన్ని గూర్చి తెలుసుకున్నారు.

'మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః' అన్న వాక్యాన్ననుసరించి ఆయన కాలేజీ వయసులో వున్నప్పుడే మనస్సును గూర్చి ఆలోచించి దానిని తన ఆధీనంలోకి తెచ్చుకున్నారు. మనస్సు చెప్పినట్లు తాము వినకుండా తాము చెప్పినట్లు మనస్సు వినేలా చేసుకున్నారు. మనస్సుకు ఏది చేయాలనిపిస్తే దానికి వ్యతిరేకంగా చేసేవారు. కూర్చోవాలనిపిస్తే గంటల తరబడి నిలుచునేవారు. నిలబడాలనిపిస్తే కూర్చునేవారు. పడుకోవాలనిపిస్తే లేచి తిరిగేవారు. నిద్రపోవాలనిపిస్తే మెలుకువగా వుండేవారు. బయటకు వెళ్ళాలనిపిస్తే

ఇంట్లోనే వుండేవారు. ఇంట్లో వుండాలనిపిస్తే బయటకు వెళ్ళేవారు. తినాలనిపిస్తే ఉపవాసం వుండేవారు. తినవద్దు అనిపిస్తే విపరీతంగా తినేవారు. నడుస్తున్నప్పుడు కాసేపు ఆగుదామని అనిపిస్తే అలా అనిపించకుండా వుండేదాకా మైళ్ళ తరబడి నడిచేవారు.

అంతేగాదు, ఆయన ఎన్నో రోజులు ఆహారం తీసుకోవడం మానేసారు. కొంతకాలం ద్రవపదార్థాలు మాత్రమే తీసుకున్నారు. అలాగే కొన్ని రోజులు ద్రవపదార్థాలు అసలు తీసుకోకుండా ఘనపదార్థాలు మాత్రమే తీసుకున్నారు. అలాగే మూత్ర బంధనము, మలబంధనము చేసారు. మామూలుగా మానవుడు యివి జరగకుండా ఎన్నిరోజులు జీవించగలడో అన్ని రోజులకంటే మూడురెట్లు ఎక్కువగా యివన్నీ చేసారు. నిద్రలేకుండా ఎన్నో రోజులు గడిపారు. అంతేగాక ఆయన చేసిన సాధనలు ఎన్నో వున్నాయి.

అంటే ఆయన కోరికలను నశింపజేసారు. కోరిక ఎప్పుడైతే నశిస్తుందో, దాని వలన ఉద్భవించే రాగ, ద్వేష, అసూయాది భావాలు నశిస్తాయి. అందుకని ఇక సాధించడానికి ఆయనకు ఏమి మిగిలింది? అంటే ఆయన సాధనంతా పూర్తయిందన్న మాట! ఇక సద్గురువనుగ్రహమే కావాలసింది!

అందుకే – పూజ్యశ్రీ మాస్టరుగారు అట్టి అర్హత సంపాదించారు గనుకనే – శ్రీ శిరిడీ సాయినాథుడు ఆయనను తమ శిష్యునిగా అంగీకరించి తమ సంపూర్ణ అనుగ్రహాన్ని ప్రసాదించారు. తమవంటివారిని చేసారు.

ఇక్కడ కొందరికి ఒక సందేహము కలుగవచ్చు. ‘శ్రీ సాయి పూజ్యశ్రీ మాస్టరుగారిని తమవంటివారుగా చేస్తే ఆయన గూడ శ్రీ సాయిలాగా జీవించాలిగదా! మరి వేరుగా వున్నారెందుకు?’ అని. ఈ ప్రశ్నకు సమాధానం సాయియే. శ్రీ సాయిని తమ గురువు పరిపూర్ణుని చేసారు. అయితే సాయి తమ గురువులాగా వున్నారా? ఎందుకుండలేదు? ఇక్కడ మనం గమనించవలసిన విషయమొకటున్నది. తమ గురువు వలన పరిపూర్ణులైనవారు గురువు వలె వుండరు. గురువు తమను ఎలా వుంచుతారో అలా వుంటారు! అదే విధంగా పూజ్యశ్రీ మాస్టరుగారు తమ గురువు తమను ఎలా వుంచారో అలా వున్నారు.

అసలు అనుగ్రహం అంటే ఏమిటి? పూజ్యశ్రీ మాస్టరుగారు అనుగ్రహం గురించి యిలా చెప్పారు: “భగవంతుని అనుగ్రహము నిరంతరం వర్షిస్తూనే వుంటుంది. దానిని గుర్తించడము, దానిని విశేషంగా పొందే యత్నం చేయడమే కావలసినది. ఈ రోజు మనం యిలా జీవించగలుగుతున్నామంటే అంతా ఆయన అనుగ్రహమే. మన చుట్టూ ఎప్పుడూ ఎన్నో ఉపద్రవాలు పొంచేవుంటాయి. వ్యాధులనుండి, ప్రకృతి వైపరీత్యాలనుండి, వ్యక్తులనుండి – యిలా ఎన్నో విధాల ఆయన మనలను కాపాడుతున్నారు. ఇది తెలుసుకుంటే భగవంతుడు మనలను ఎంతగా అనుగ్రహిస్తున్నారో అర్థమవుతుంది.

అంతేగాదు, మనకు వచ్చే కష్టాలు గూడ ఆయన అనుగ్రహమేనని పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పేవారు. మనం చేసే పొరపాట్లకు ఆయన యిచ్చే శిక్ష, శిక్షణ గూడానని ఆయన చెప్పేవారు. చేసిన తప్పులను తెలుసుకోవడానికి, వాటిని తిరిగి చేయకుండా వుండడానికి మనం మన పిల్లలను ఎలా శిక్షిస్తామో అలాగే ఆయన గూడా చేస్తారని పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పేవారు. మనం సరియైన మార్గాన నడవడానికి అవి దోహదపడతాయని ఆయన చెప్పేవారు.

“అయితే పూజ్యశ్రీ మాస్టరుగారికి వచ్చినంతటి అనుగ్రహము మనకు అవసరమా?” అని మనకనిపించవచ్చు. అలా అనిపించడమంటే ఏమిటంటే మనకు శాశ్వతమైన తృప్తి శాంతులు అవసరం లేదని మనమనుకుంటున్నామన్నమాట. మరొక రకంగా చెప్పాలంటే అంతటి తృప్తి శాంతిని పొందిన వారి వద్దనుండి మనం కొద్ది కొద్దిగా మాత్రమే; అంటే మన సమస్యలు తీరడం వల్ల వచ్చే శాంతిని మాత్రమే మనం కోరుకుంటున్నామన్నమాట. కానీ అది శాశ్వతంగా వుండడం లేదుగదా! కోరికల వెంబడి కోరికలు తెంపు లేకుండా వస్తూనే వుంటాయి. నిరంతరం మనం సమస్యల

సుడిగుండంలో చిక్కుకుపోతూ వాటికోసం మహాత్ముల దగ్గరకు పరిగెత్తుతూనే వుంటున్నాం గదా! వాటిలో కొన్ని తీరవచ్చు, కొన్ని తీరకపోవచ్చు. మరి మనకు తృప్తి, శాంతి ఎంతవరకూ వచ్చినట్లు? దీనికి పరిష్కారం ఏమిటి?

ఈ ప్రశ్నలకు సమాధానమే పూజ్యశ్రీ మాస్టరుగారి జీవితం. ఆయన ఒక్కొక్క సమస్య కోసం భగవంతుని అడగడంగాక ఈ సమస్యలన్నింటికీ మూలమైన దానిని సాధించారు. శాశ్వత శాంతిని పొందారు. అందుకని మనం శాంతిని కోరుకుంటున్నప్పుడు అట్టి శాంతి కోసం తప్పక అట్టి ప్రయత్నం చేయవలసినదే! అటువంటి అనుగ్రహాన్ని పొందవలసినదేనని చెప్పక తప్పదు.

అయితే మనం అంతటి కఠినతరమైన సాధన చేయగలమా? మనకంతటి మనోబలం వున్నదా? మరి మనం సాయినాథుని అనుగ్రహాన్ని పొందడం అసాధ్యమా? అనే చింత మనకు కలగవచ్చు. అందుకే పూజ్యశ్రీ మాస్టరుగారు యిలా చెబుతుండేవారు. “ఒక్కొక్క విషయాన్ని గూర్చి నేనెంతో కష్టపడి తరచి తరచి ఆలోచించి, సంవత్సరాల తరబడి అన్వేషించి తెలుసుకున్న విషయాలను అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినట్లు, అతి సులభమైన మార్గాలను మీకు చెబుతున్నాను. ఎందుకంటే నాకానాడు ఎవ్వరూ చెప్పలేదు కనుక నేనే స్వయంగా తెలుసుకోవలసి వచ్చింది. ఇప్పుడు మీకు కష్టం లేదు. నేను చెప్పినవాటిని ఆచరిస్తూ పోతే చాలు. మీరు తప్పక సాయి యొక్క సంపూర్ణ అనుగ్రహాన్ని పొందగలరు”.

అయితే పూజ్యశ్రీ మాస్టరుగారు ఏం చెప్పారు? ఆ సంగతి మనందరికీ తెలుసు! మహాత్ముల చరిత్రలు పారాయణ చేసుకోమని, సత్సంగాలు చేసుకోమనీ చెప్పారు. నిరంతరం సాయిని స్మరించమని, అందరిలో ఆయనే వున్నాడని చూడమని, అందరూ కలిసి మెలసి జీవించమనీ–యిలా యింకా ఎన్నో ఎన్నెన్నో!!!

వీటిలో కొన్నింటిని మనం చేస్తున్నాము, కొన్నింటిని చేయడానికి ప్రయత్నిస్తున్నాము. కానీ ఏది చేసినా ఎలా చేయాలో ఆయన చెప్పిన మూలసూత్రాన్ని పాటించకపోతే వ్యర్థమని ఆయన చెప్పిన మాటను గుర్తుంచుకోవాలి.

ఉదాహరణకు సత్సంగాలు చేయడము, సత్సంగాలకు వెళ్ళడము దాదాపు అందరమూ చేస్తూనే వున్నాము. సత్సంగాలు చేస్తున్నప్పుడుగానీ సత్సంగాలకు వెళ్తున్నప్పుడుగానీ మన ప్రవర్తన, మన ఆలోచనలు ఎలా వుంటున్నాయి? ఆయా విషయాలలో పూజ్యశ్రీ మాస్టరుగారు ఏయే జాగ్రత్తలు చెప్పారు? అనేది గమనించుకోవాలి.

‘నేను మాస్టరుగారు చెప్పిన విధంగా సత్సంగాలు చేస్తున్నాను, ఇన్ని సత్సంగాలు చేసాను. నన్ను వాడు గౌరవించడా?’ అని ఎప్పుడైనా అనిపించడము, అనడమూ జరిగిందనుకుందాం. దాని వెనకాలవున్న భావమేమిటో ఆలోచించుకోవాలి. అంటే మనం సత్సంగాలు చేస్తున్నామన్న అహంకారము, మనం గొప్పవాళ్ళమన్న గర్వము, మనలను యితరులు గౌరవించాలన్న కీర్తికాంక్ష వున్నాయని అర్థం. మనలను నలుగురూ గౌరవించడము, మనలను కార్లలో త్రిప్పడము, ఎక్కడెక్కడికో సత్సంగాలకు తీసుకెళ్ళడము, విదేశాలకు తీసుకువెళ్ళడము, మనకు అనుచరులు లక్షల కొద్దీ వుండడమూ యివేవీ మన ఉన్నతికి సరియైన కొలబద్దలు కావు. మనలోని బలహీనతలను గుర్తించి, వాటిని తొలగించుకోవడానికి ఎంతగా ప్రయత్నిస్తున్నాము అన్నదే పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పిన దానిని అమలు పరుస్తున్నామనడానికి నిదర్శనం. ఒక ప్రక్క ఆయన చెప్పినట్లు సత్సంగాలు మొదలైనవి చేసుకుంటూ, మరొకప్రక్క మనలోని బలహీనతలను తొలగించుకుంటూ పోతుండడమే పూజ్యశ్రీ మాస్టరుగారి అనుగ్రహానికి పాత్రులమవడానికి, అర్హత సంపాదించు కోవడానికి మార్గము.

అందుకని ఈ ఫిబ్రవరి తొమ్మిదిని (9.2.2010) పురస్కరించుకుని మనలను మనం సరిదిద్దుకునే ప్రయత్నం చేద్దాం.

జై సాయి మాస్టర్ !!!

# మాతృదేవి స్మృతులు

**శ్రీ యోగ నాగేంద్ర**

పూజ్యశ్రీ అలివేలు మంగమ్మతల్లి లీలావైభవాన్ని హైదరాబాదులోని నాగోలు వాస్తవ్యులు శ్రీ యోగ నాగేంద్రగారు ఈ విధంగా తెలియజేస్తున్నారు.

మాది గుత్తి అనే ఊరు. అక్కడ కొంతమంది యువకులం భజనలు చేసేవారము. పూజ్యశ్రీ మాస్టరుగారి గురించి తెలిశాక వారు వ్రాసిన శ్రీ సాయి లీలామృతము పారాయణ చేయడం మొదలుపెట్టాము. 1995లో జాజం శ్రీనివాస్ గారి (గుత్తి శ్రీనివాస్ గారు) ద్వారా పూజ్యశ్రీ అమ్మగారి గురించి విని తరచూ ఒంగోలు దర్శిస్తూ వుండేవారము. శ్రీ ద్వారకబాబుగారి ఉపనయనానికి వారం రోజులు హాయిగా అక్కడే వుండిపోయాము.

ఇంకొకసారి నాకు ఒంగోలులో పూజ్యశ్రీ అమ్మగారి ఇంట్లో 47 రోజులపాటు వుండే అవకాశం వచ్చింది. ప్రతిరోజూ ఉదయం కాలకృత్యాలు తీర్చుకుని శ్రీ బాబుగారితో క్రికెట్ ఆడుకునేవాడిని... అంతే! పూజ్యశ్రీ అమ్మగారు అంటే గురుపత్ని అని కానీ, సేవ చేసుకోవాలని కానీ, భక్తి భావంతో వుండాలని కానీ తెలిసేది కాదు.

ఒకరోజు పూజ్యశ్రీ అమ్మగారు నన్ను పిలిచి,"నువ్వు రోజూ ఏం చేస్తున్నావు?" అని అడిగారు. "బాబుగారితో క్రికెట్ ఆడుకుంటున్నాను", అని చెప్పాను. "ఆటలు సరే! మిగతా సమయం ఏం చేస్తున్నావ్?" అని అడిగారు. "ఖాళీగానే వుంటాను" అని చెప్పాను. "మరి పారాయణ చేయవా?" అని అడిగారు. "శ్రీ సాయిలీలామృతము పారాయణ చేస్తాను" అని చెప్పాను. "మరి శ్రీ గురుచరిత్ర చేయవా?" అని అడిగారు. "చేయను అమ్మగారు! దాంట్లో చాలా ఆచారాలు వుంటాయి. అది బ్రాహ్మణులు మాత్రమే చేయగలరేమో! నావంటివాడికి సరిపోదు" అని సమాధానం చెప్పాను. అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు, "అలా ఏం లేదే! అందరూ చేస్తుంటారు కదా!" అన్నారు. "ఏమో అమ్మగారూ! దాంట్లో చాలా నియమాలు చెప్పి వున్నారు కదా! అవన్నీ నేను పాటించలేను. అందుకని చేయను" అన్నాను. అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు, "అవేమీ పాటించక్కర్లేదు. స్నానం చేసి పారాయణ చేసుకో చాలు!" అన్నారు. "శ్రీగురుడు నిష్ఠాగరిష్ఠుడు కదా! నేను మాంసం తింటాను. అందుకని కూడా నేను పారాయణ చేయట్లేదు" అని నా మనసులో వున్న భావం బయటపెట్టాను. "అలా ఏమీ లేదు. స్నానం చేసి పారాయణ చేసుకున్నాక నువ్వు ఏదైనా తినవచ్చు!" అని చెప్పారు. అప్పటినుంచి ధైర్యం వచ్చి శ్రీ గురుచరిత్ర పారాయణ కూడా చేస్తున్నాను. పూజ్యశ్రీ అమ్మగారు మరలా ఇంకొకసారి పిలిచి, "నువ్వు 'శ్రీ సాయి మాస్టర్ స్మృతులు' గ్రంథం చదివావా?" అని అడిగారు. చదవలేదని చెప్పాను. వెంటనే వారు నాకు కొత్త గ్రంథం తెప్పించి ఆశీస్సులు వ్రాసిచ్చారు.

అలా అక్కడ గడుపుతున్న రోజుల్లో గుత్తిలో మా ఇంటి పరిస్థితులు ఏమాత్రం బాగలేవు. 47 రోజుల తర్వాత నేను బయలుదేరి మా ఊరు వెళ్ళిపోయాను. అప్పటినుంచి చిత్రంగా మా పరిస్థితులన్నీ నెమ్మదిగా చక్కబడ్డాయి. అంతా పూజ్యశ్రీ అమ్మగారి అనుగ్రహమే!

తరువాత రైల్వేలో టి.సి. ఉద్యోగానికి దరఖాస్తు చేశాను. హైదరాబాదుకి వచ్చి దానికి సంబంధించిన పరీక్షకు కూడా హాజరయ్యాను. అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు హైదరాబాదులోనే చిక్కడపల్లిలో వున్నారని తెలిసి దర్శనానికి వెళ్ళాను. పూజ్యశ్రీ అమ్మగారు, "బావున్నావా? ఏంటి సంగతి?" అని అడిగారు. "ఇక్కడ

టి. సి. పోస్టుకి పరీక్షలు వ్రాయడానికి వచ్చాను” అనగానే పూజ్యశ్రీ అమ్మగారు ఫక్కున నవ్వారు! నాకేమీ అర్థం కాక అలాగే వారి వైపు చూస్తూ వుండిపోయాను. అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు, “ఏమీ లేదు, మీకు రైల్వే పోస్టులు తప్పితే ఇంకేమీ కనిపించవా?! అని అనిపించి నవ్వాను” అన్నారు. “మాకు ఇంతకంటే దారిలేదు అమ్మగారూ! ఈ పరీక్షల్లో నేను పాసవ్వాలి. నాకు ఈ ఉద్యోగం రావాలి” అని పూజ్యశ్రీ అమ్మగారికి నమస్కరించుకున్నాను. పూజ్యశ్రీ అమ్మగారు కాసేపు మౌనంగా వుండి, “నువ్వు హైదరాబాదుకి వస్తావులే!” అన్నారు. ఇంక నేను పరమానందంతో, ‘నేను హైదరాబాదుకు వస్తానని పూజ్యశ్రీ అమ్మగారు అన్నారు కనుక నేను తప్పకుండా పరీక్షలు పాసై, నాకు టి.సి. ఉద్యోగం వచ్చేస్తుంది’ అనుకుంటూ ఆనందంగా గుత్తికి వెళ్ళిపోయాను. పరీక్ష ఫలితాలు వచ్చాయి. ఉత్తీర్ణత పొందిన వారిలో నా పేరు లేదు! నేను ఒక్కసారిగా దిగ్భ్రాంతికి లోనయ్యాను. పూజ్యశ్రీ అమ్మగారు చెప్పాక కూడా ఇలా జరిగిందేమిటని ఆశ్చర్యపోయాను.

నాకు అప్పటికి 30 సంవత్సరాలు వచ్చేశాయి. మా ఇంటి పరిస్థితులు అంతంత మాత్రంగా వున్నాయి. అందువల్ల కొంతకాలానికి మేము గుత్తిని వదిలిపెట్టి షోలింగర్ అని తమిళనాడులోని మా స్వస్థలానికి వెళ్ళిపోయాము.

ఒకసారి నేను రైల్వేలో కొంచెం పెద్ద ఉద్యోగంలో వున్న డాక్టర్ ప్రసాద్ గారిని కలిసి నాకు ఆయన దగ్గర రైల్వేలో ఏదైనా ఉద్యోగం ఇప్పించమని అడిగాను. ఆయన, “నేను ఐదు సంవత్సరాల తర్వాత రిటైరైపోతాను. నాకు ప్రమోషన్ వస్తేనే నీకు ఏదైనా ఉద్యోగం ఇప్పించగలను. నాకంటే ముందున్న 50 మందికి ప్రమోషన్ ఇచ్చాకనే నాకు ప్రమోషన్ ఇస్తారు. అది నేను ఉద్యోగంలో వుండగా జరగకపోవచ్చు” అని చెప్పారు.

నేను నిరాశ చెందాను.

అప్పుడే ఒక అద్భుతం జరిగింది. ఆ 50 మందికి ప్రమోషన్ రాకుండానే డాక్టర్ ప్రసాద్ గారికి చీఫ్ మెడికల్ ఆఫీసరుగా రైల్వేలో ప్రమోషన్ వచ్చేసింది!! ఆయనకు వెంటనే నేను గుర్తొచ్చానట! నాకు ఉద్యోగం ఇప్పించడానికే ఇలా జరిగిందని ఆయనకు అనిపించి నాకు కబురు చేశారు! ఆయన నన్ను తన క్రింద ఉద్యోగానికి దరఖాస్తు పెట్టుకోమని చెప్పారు. కానీ నాకు అప్పటికి 31 సంవత్సరాలు దాటాయి. ఆ విషయం వారికి చెప్పాను. నాకు వయోపరిమితి దాటడం వల్ల ఆ ఉద్యోగం నాకు రాదని తెలిసింది. మళ్ళీ నాకు నిరాశే ఎదురైంది!

అప్పుడే మహాద్భుతమైన లీల జరిగింది!! కొద్దిరోజుల్లోనే నాకు ఇస్తానన్న ఆ ఉద్యోగానికి రైల్వే శాఖ వారు 30 ఏళ్ల నుంచి 33 ఏళ్ళకి వయోపరిమితి పెంచారు!!! వెంటనే డాక్టర్ ప్రసాద్ గారు నన్ను ఆ ఉద్యోగంలో నియమించారు. అయితే ఆరు నెలల వరకు ఒక్కరోజు కూడా సెలవు పెట్టకుండా హాజరైతేనే ఆ ఉద్యోగం స్థిరపరుస్తామని షరతు పెట్టారు. నేను అలాగే చేశాను. అప్పుడు నాకు ఆ ఉద్యోగం ఖరారు చేశారు. నాకు ఉద్యోగం రాగానే మరలా వెంటనే రైల్వేశాఖవారు ఆ ఉద్యోగానికి వయోపరిమితి 33 ఏళ్ల నుంచి 30 ఏళ్లకి మరలా కుదించారు!! ఇది నా జీవితంలో జరిగిన అతి పెద్ద లీల. పూజ్యశ్రీ అమ్మగారి ఆశీస్సులతో కేవలం నాకు ఉద్యోగం రావడం కోసమే రైల్వే యంత్రాంగంలోనే అంత పెద్ద మార్పు జరిగిందన్నమాట! పూజ్యశ్రీ అమ్మగారు ఘటనాఘటన సమర్థులు!

నాకు మొదటి పోస్టింగ్ గుంతకల్లులో వేశారు. ఒక సంవత్సరం తర్వాత మా సార్ కి ప్రమోషన్ వచ్చి హైదరాబాదుకు వచ్చారు. నిజానికి నేను గుంతకల్లులోనే నా విధులు కొనసాగించవచ్చు. కానీ మా సార్ కుటుంబమంతా పట్టుపట్టి నన్ను హైదరాబాదుకు తీసుకొచ్చారు. అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు, “నువ్వు ఇక్కడికి వస్తావు లే!” అని చెప్పిన మాట ఠక్కున గుర్తొచ్చింది! వారి మాటకు తిరుగులేదు, అది జరిగి తీరవలసినదే! నేను ఆయన దగ్గరే హైదరాబాదులో పని చేస్తుండేవాడిని.

అది 2007వ సంవత్సరం. పూజ్యశ్రీ అమ్మగారు మల్కాజిగిరిలో వున్నారని తెలిసి తరచూ దర్శనానికి వెళుతుండేవాడిని. ఆ సమయంలోనే నా కన్నతల్లి కాలం చేశారు. కొన్నిరోజులకు పూజ్యశ్రీ అమ్మగారు నాగోలుకి వెళ్లిపోయారు. మా సార్ రిటైర్ అవ్వగానే నన్ను వర్క్ షాపుకి బదిలీ చేశారు. అప్పుడు నేను కూడా నాగోలుకి

వచ్చేశాను.

నేను ఉద్యోగంనుంచి వచ్చాక సాయంత్రం సత్సంగంలో పూజ్యశ్రీ అమ్మగారి సమక్షంలో భజన చేసేవాడిని. నేను మృదంగం, కంజరి, డప్పులాంటి వాయిద్యాలన్నీ వాయించేవాడిని. 'ఓం సాయినాథ జై! గురు భరద్వాజ జై!!' అనే నామాన్ని రకరకాల రాగాలలో కూర్చి పాడేవాడిని. ఒకసారి పూజ్యశ్రీ అమ్మగారు, "నువ్వు భజన చేసేటప్పుడు ఏ భావంతో చేస్తావు?" అని అడిగారు. "మీ దర్శన సమయాన్ని బట్టి మిమ్మల్ని భావన చేసుకుంటుంటాను. దానిని బట్టి కొన్ని రాగాలు ఎంపిక చేసుకుంటాను. ఉదాహరణకి చారుకేసి, చక్రవాకం రాగాల వంటి సాయంత్రపు రాగాలు పాడుతున్నప్పుడు తెప్పోత్సవం జరుగుతున్నట్లు, అందులో మీరు, మాస్టరుగారు వున్నట్లు, చుట్టూ మునులు, ఋషులు వున్నట్లు భావన చేసుకుంటాను. మధ్యాహ్నం సమయంలో పాడే రాగాలు గంభీరంగా వుంటాయి. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారిని, మిమ్మల్ని శివపార్వతుల లాగా భావించుకుంటాను" అని చెప్పాను. అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు, "చాలా బాగుంది! అయితే నీ ఎదురుగా బాబా, మాస్టరుగారు కూర్చున్నట్లు భావన చేస్తూ పాడు!" అని చెప్పారు.

నాగోలులో సత్సంగాలలో సత్సంగసభ్యులందరమూ కలిసి ఆధ్యాత్మికంగా, ఉత్సాహంగా భజన చేసుకునేవారము. పూజ్యశ్రీ అమ్మగారి సమక్షంలో భజనలు, ఏకాహాలు చాలాసార్లు జరుగుతుండేవి. ఈ ఏకాహాలలో గురుపుత్రులు శ్రీ ద్వారకబాబుగారు, గురుపుత్రిక శ్రీమతివేదమ్మగారు, వారి కుమారులు తీర్థచరణ్ కూడా పాల్గొనేవారు.

కరోనా సమయంలో 2020 అక్టోబరులో పూజ్యశ్రీ అమ్మగారి జయంతి సందర్భంగా సెప్టెంబరు 1వ తేదీనుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు 'ఓం సాయినాథ జై! గురుభరద్వాజ జై!!' నామాన్ని 30 రోజులపాటు 30 రాగాలలో కూర్చి పాడి వాట్సప్ లో సమర్పించుకోవడం జరిగింది. కానీ ఇంకా ఇతర రాగాలలో నామం రావడంతో అది పూజ్యశ్రీ మాస్టరుగారి పుట్టినరోజు వరకూ కొనసాగింది. అంటే 60 రాగాలలో నామం కూర్చడం జరిగింది. ఆ తరువాత ఎంత ప్రయత్నించినా ఒక్క కూర్పు కూడా రాలేదు! పూజ్యశ్రీ అమ్మగారే దయతో అలా నా చేత సేవ చేయించారు.

పూజ్యశ్రీ అమ్మగారి సమక్షంలో ఎన్నో ఆధ్యాత్మిక చర్చలు జరిగేవి. నాకొక ప్రశ్న వుండేది. సాయి చావడికి బయలుదేరే ముందు కుడికాలుతో ధునిలో కట్టెలు సర్ది, కుడిచేతితో అక్కడుండే దీపాన్ని ఆర్పి వెళ్ళేవారని చరిత్రలో వుంది. 'దీపాలార్పడం, కాలుతో కట్టెలు సర్దడం అశుభమైన పనులు కదా, ఇవి బాబా ఎలా చేశారు?' అని అనుమానం వచ్చి నాకు తెలిసిన కొంతమందిని అడిగాను. అందులో ఒకరు సమాధానం చెప్పకపోగా, "బాబా ఆయన ఇష్టమొచ్చినట్లు చేసుకుంటారు, నీకెందుకు?" అని నామీద కోప్పడ్డారు! దాంట్లో అంత కోప్పడవలసినది ఏముందో నాకర్థం కాలేదు. ఒకసారి ఇదే ప్రశ్న పూజ్యశ్రీ అమ్మగారిని అడిగితే, "అవి వివిధ స్థాయి నిజాలు. పారాయణ చేయగా చేయగా సమయమొచ్చినప్పుడు నీకే తెలుస్తుంది" అని ప్రశాంతంగా చెప్పారు. నాకు చాలా ఆనందం వేసింది.

ఒకరోజు శివపురిలో సాయంత్రం సత్సంగం జరుగుతోంది. పూజ్యశ్రీ అమ్మగారు అవకాశం ఇస్తే ఒక ప్రశ్న అడగాలని అనుకుంటూ సత్సంగానికి వచ్చాను. పూజ్యశ్రీ అమ్మగారు, "ఎవరికైనా సందేహాలు వుంటే అడగండి" అన్నారు! ఎవరూ మాట్లాడలేదు. నావైపు చూశారు అడగమన్నట్లు! నాకు చాలా ఆశ్చర్యం వేసింది. వెంటనే నేను, "అమ్మగారూ! శ్రీ సాయి లీలామృతములో ఉపదేశాలు-2 లో ముముక్షువు అయినవాడు శ్రోత్రియుడు, బ్రహ్మనిష్ఠుడు అయిన గురువునే సమిధలు చేతపట్టుకొని పోయి ఆశ్రయించాలని వుంటుంది కదా! అంతటి గురువుకు ఆ పుల్లలతో(సమిధలు) పనేమిటి?" అని అడిగాను. అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు, "ధునిలో కట్టెలు వేయడం ఎందుకని బాబాను అడిగితే, 'మీ పాపాలు దహించడానికే!' అన్నారు కదా?! అదేవిధంగా సమర్థుడైన గురువు నీ సమిధలు తీసుకుని నీ పాపాలు దహిస్తారు" అని వివరణ యిచ్చారు. ఇలాంటి చాలా చర్చలు జరిగేవి. అది మహాద్భుతమైన కాలం.

ఒకసారి పూజ్యశ్రీ అమ్మగారు, "పెళ్లి గురించి ఏమనుకుంటున్నావు?" అని అడిగారు. "నాకు మా

ఇంట్లోవాళ్ళు ఏవో సంబంధాలు చూస్తున్నారు కానీ, నేను మీరు చెప్పిన సంబంధమే చేసుకుంటానని వాళ్లతో చెప్పాను అమ్మగారూ!" అన్నాను. "ఓహో అలాగా! అయితే చూద్దాములే!" అన్నారు. ఇక అప్పటినుంచి నా వివాహం విషయం పూజ్యశ్రీ అమ్మగారు చూసుకుంటారులే అని ధీమాగా వున్నాను.

శ్రీ బాబుగారు చెప్పిన పర్మాకల్చర్ విధానంలో తోటపనులు, పంటలు పండించడం, పూజ్యశ్రీ అమ్మగారు సూచించే దీక్షలు చేయడం, నాకు తెలిసిన వారందరికీ హోమియో వైద్యమందించడం, నా ఉద్యోగ విధులు... వీటి అన్నిటితోటి కాలం ఎలా గడిచిందో తెలియనే లేదు. అలాగే నాకు 38 సంవత్సరాల వయస్సు వచ్చేసింది. ఈ వయసులో ఇక పెళ్లి అనవసరమని, గురుకుటుంబం నీడలో ఆధ్యాత్మికంగా జీవితం గడపాలని అనుకున్నాను. కానీ అక్కడ బాబుగారి దగ్గర గురుకులం పిల్లలను చూసినప్పుడు, వేదమ్మగారి బాబును చూసినప్పుడు, నాకు కూడా వివాహమై సంతానం కలిగితే వారిని కూడా అలా ఉన్నతంగా ఆ మార్గంలో పెంచుకోవాలని కోరికగా వుండేది.

2014లో ఒకరోజు వేదమ్మగారిని కలిసి నా వివాహ విషయం పూజ్యశ్రీ అమ్మగారికి గుర్తుచేయమని కోరాను. శ్రీ బాబుగారు నన్ను పిలిచి పూజ్యశ్రీ అమ్మగారు నన్ను సంబంధాలు చూసుకోమన్నారని చెప్పారు. గురుబంధువుల నుంచి, మాట్రిమోనీ నుంచీ చాలా సంబంధాలే వచ్చాయి. చిత్రంగా చాలాసార్లు నిశ్చయతాంబూలాల వరకు వచ్చి నా వివాహప్రయత్నం విఫలమయ్యేది! "నేను టీవీ చూడను!" అనగానే "అమ్మ బాబోయ్! టీవీ చూడరా?!", అని ఒకరు, "బహుశా నేను ఉద్యోగం మానేసి వ్యవసాయం చేసుకోవచ్చు!" అని అనగానే, "అయ్యో, రైల్వే ఉద్యోగం కదా అని చేసుకుందామనుకున్నాం!" అని ఇంకొకరు... ఇలా మన జీవిత విధానం, నా ఆలోచనలు చెప్పేసరికి వెనక్కి వెళ్ళిపోయేవారు!

ఒకరోజు శ్రీ బాబుగారు ఫోన్ చేసి, "రేపు ఆఫీసుకి వెళ్లవద్దు, అమ్మగారు మాట్లాడతారట!" అని చెప్పారు. మర్నాడు వెళ్లేసరికి పూజ్యశ్రీ అమ్మగారు, గురు కుటుంబము, కొంతమంది సత్సంగసభ్యులు అక్కడ వున్నారు. మా సత్సంగంలోనే వున్న రేణుక అనే అమ్మాయితో నాకు వివాహం నిశ్చయించాలని గురుబంధువులు అనుకుంటున్నారని, దానికి నా అభిప్రాయం చెప్పమని పిలిపించారు. నేను తిరిగి మళ్లీ పూజ్యశ్రీ అమ్మగారితో, "మీరు ఎలా చెప్తే అలాగే అమ్మగారూ!" అన్నాను. 2015వ సంవత్సరం ఫిబ్రవరిలో నాకు, రేణుకకు పూజ్యశ్రీ అమ్మగారి ఆధ్వర్యంలో, గురుకుటుంబం ఆశీస్సులతో, సత్సంగసభ్యుల, మా కుటుంబసభ్యుల సమక్షంలో, అత్యంత వైభవంగా, నేను కనీవినీ ఊహించనట్లు మూడు రోజులు వివాహం జరిగింది! నాకు ఇప్పుడు ఒక పాప, ఒక బాబు. పూజ్యశ్రీ అమ్మగారి చల్లటి నీడలో నాగోలులో హాయిగా కాలం గడుపుతున్నాము.

ఎక్కడో గుత్తిలో వుండి అక్కడనుంచి ఇంకా దూరంగా తమిళనాడు వెళ్లిపోయిన నన్ను పూజ్యశ్రీ అమ్మగారు మాతృవాత్సల్యంతో అక్కున చేర్చుకొని, నన్ను కూడా తమ కుటుంబసభ్యులతో సమానంగా చూసుకుని, నా జీవితంలో వచ్చే ఒడిదుడుకులనన్నింటిని సరిదిద్దుతూ, నాకు వారి చల్లటి నీడలో ఆశ్రయమిచ్చారు.

మూడు సంవత్సరాల క్రితం మా ఆఫీసులో నేను చేయని నేరానికి నామీద పెద్ద నింద వచ్చింది. దాని వల్ల ఆర్థికంగా చాలా నష్టం వచ్చింది. ఆ క్లిష్ట పరిస్థితుల్లో పూజ్యశ్రీ అమ్మగారు నాకు అండగా నిలిచి దాని నుంచి నన్ను ఒక సంవత్సరంలోపు బయటపడేశారు! వారి అండ లేకుంటే నా ఉద్యోగమైనా పోయేది, మానసికంగానైనా దెబ్బ తినేవాడిని. పైగా ఆ నష్టం పూడుకోడానికి చాలా సంవత్సరాలు పట్టేది కూడా! వారి అండతో అంతటి కష్టాన్ని ధైర్యంగా ఎదుర్కోగలిగాను. పూజ్యశ్రీ అమ్మగారి కరుణాపూరిత ప్రేమకు శిరస్సు వంచి పాదాభివందనాలు చేస్తున్నాను.

జన్మజన్మలకూ మన గురుదంపతుల అండదండలు, సేవాభాగ్యం కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

# గుమ్మళంపాడు లో గురుపూర్ణిమ మహోత్సవం

**శ్రీమతి టి. పద్మావతి**

**"గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః
గురుస్సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః"**

అని పై శ్లోకంలో చెప్పినట్టు, అంతటి సమర్థ సద్గురు శిరిడి సాయినాథులవారు, వారిని అనుసరించి ఆరాధించిన గురు భరద్వాజులవారు, వారిని సేవించి తరించిన మనందరికీ అమ్మ అయిన దివ్యజనని అలివేలుమంగమ్మతల్లి కొలువైవున్న దివ్య సన్నిధానమునందు గురుపూజా మహోత్సవం జూలై 10, 2025 గురువారం నాడు వైభవోపేతంగా జరిగింది.

కొన్నిరోజుల ముందుగా వేరేప్రదేశాల నుండి భక్తులు సన్నిధానమునకు చేరుకుని, ఈ సంవత్సరం జూలై 10వ తేదీన జరుగబోయే గురుపూర్ణిమ మహోత్సవానికి సన్నాహాలు చేశారు. ఆ శుభవేళ ఎప్పటిలాగే పూజ్య గురుదేవులైన అలివేలుమంగాసమేత భరద్వాజుల మేలుకొలుపుతో మొదలై, అనంతరం శ్రీ సాయినాథుల వారికి కాకడ హారతి, తదనంతరం పూజ్యశ్రీ అలివేలుమంగమ్మ తల్లికి ప్రత్యేక మంగళ ద్రవ్యాలతో అభిషేకం జరిగింది. సమర్థ సద్గురు సాయినాథుని, గురుభరద్వాజులను ప్రత్యేక ఆసనాలంకృతులను చేసి, మధ్యలో తన మాతృప్రేమాత్మకమైన దృక్కులతో అందరికీ ఆహ్వానం పలుకుతున్నట్లు చిత్రపటం రూపంలో కొలువైవున్న పూజ్యశ్రీ అమ్మగారు ఆసీనులవ్వగా, ఈ ముగ్గురుమూర్తులతో, ఆ దివ్య సన్నిధి, నూతన శోభతో విరాజిల్లింది. గురుపూర్ణిమ సందర్భంగా విశేషపూజ



చేయటానికి శ్రీ శ్రీకాంత్ గారు, శ్రీమతి వేదమ్మగారు విచ్చేసి పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ తల్లిని పూలమాలాలంకృతులను చేసి వందనాలర్పించారు. గురుపుత్రిక శ్రీమతి వేదమ్మగారు అందరి తరపున గురుపూజ ప్రారంభించారు. పూజకు ముందు గురుభరద్వాజుల విరచితమైన, "సాయి అవతరణే మానవాళికి గురుపూర్ణిమ" అనే వ్యాసాన్ని చదివి ఈ విధంగా వివరించారు.

ఈ గురు పూర్ణిమ సందర్భంగా పూజ్యశ్రీ అమ్మగారి పవిత్ర సన్నిధిలో, పూజ, సత్సంగం చేసుకునే అవకాశాన్ని కల్పించిన పూజ్యశ్రీ బాబా గారికి, మాస్టరుగారికి, అమ్మగారికి మనసారా కృతజ్ఞతలు తెలుపుకుంటూ, పూజ్యశ్రీ మాస్టరుగారు రాసిన ఈ వ్యాసాన్ని చదువుకుని పూజ చేసుకుంటే, ఏ భావంతో ఈ గురుపూర్ణిమ జరుపుకోవాలి అనే విషయాన్ని మనసులో స్థిరపరచుకుని శ్రద్ధగా ఈ పూజ చేసుకొంటామన్న ఉద్దేశంతో ఇప్పుడు ఈ వ్యాసం



చదవడం జరుగుతోంది. దాన్ని భావాన్ని హృదయంలో నిలుపుకొని ఈ గురు పౌర్ణమి సార్థకం చేసుకుందాం.

మానవుడు తన బాల్యంలో చిన్న చిన్న మాటల దగ్గర నుంచి జీవితంలో సర్వ విషయాలను మరొకరి నుంచి నేర్చుకుంటాడు. ఇందులో భాగంగా ప్రకృతి నుంచి వైజ్ఞానిక విషయాలు తెలుసుకోవడానికి కూడా మరొకరి బోధ అవసరమవుతుంది. అదే ప్రకృతి నుండి పారమార్థిక విషయాలను కూడా మానవుడు ఉత్తమమైన గురువుల వద్ద నేర్వవలసిందే. భాగవతంలోని అవధూత, ఉద్ధవగీతలో సాక్షాత్తు శ్రీకృష్ణుడి చేత కూడా ప్రశంసించబడిన పూర్ణపురుషుడు. తాను ప్రకృతిలోని 24 మంది గురువుల నుండి ఏమి నేర్చి పరిపూర్ణతను సాధించాడో చెబుతాడు. దానినే పరమ ప్రామాణికంగా శ్రీకృష్ణుడు ఉద్ధవునికి బోధిస్తాడు. తిరిగి ఆ బోధే మొదటి రెండు దత్తాత్రేయ అవతారాల చరిత్ర సంపుటమైన శ్రీ గురు చరిత్ర మనకు బోధిస్తుంది. మూడవ దత్తాత్రేయ అవతారమైన శ్రీ మాణిక్య ప్రభువు కూడా తిరిగి జ్ఞానం అలానే ఆశించినట్లు తన భక్తులతో చెప్పారు.

పారమార్థిక జ్ఞానమే లేని పామర జీవితం అసూయ, ద్వేషము, మమకారము, మొదలైన వాటిని పెంపొందించి ఇటు వ్యక్తిని అటు సమాజాన్ని కూడా తారుమారు చేస్తుంది. పూజ్యశ్రీ అమ్మగారు ఒకసారి మనలోని దుర్గుణాల గురించి ఏమన్నారంటే, మనం టార్చ్ వేసుకుని అనుక్షణం మనలో వెతుక్కుంటూ ఉండాలి. చాలా అప్రమత్తతతో ఉండాలి. అందువల్ల ప్రతిరోజు రాత్రి పడుకునే ముందు ఈరోజు అంతా ఎలా ప్రవర్తించాను అని విశ్లేషణ చేసుకోవాలి అని!

ఉదాహరణకి ఒకరిపై అసూయ వచ్చింది. దాన్ని ఆ వ్యక్తికి చెప్పి క్షమించమని వేడితే చాలా మంచిదట. కానీ అలా చెప్పడం మనలాంటి వాళ్ళకి చాలా కష్టం. ఎంతగా అయితే అసూయ, ద్వేషం పనిచేస్తున్నాయో అంతగా ఆధ్యాత్మికంగా లేమని అర్థం అని అంటారు పూజ్యశ్రీ అమ్మగారు. 'ఆధ్యాత్మికతలో ఆత్మ విమర్శ తగినది' ఇది నాకు చాలా ఇష్టమైన సూక్తి అని చెప్పారు పూజ్యశ్రీ అమ్మగారు. కనుక పారమార్థిక జ్ఞానమే లేని పామర జీవితం అసూయా, ద్వేషం, మమకారం మొదలైనవాటిని పెంపొందించి ఇటు వ్యక్తిని, అటు సమాజాన్ని కూడా తారుమారు చేస్తుంది. ఏ అనంత విశ్వం, పైన చెప్పిన మహనీయులందరికీ గురు స్వరూపమై బ్రహ్మజ్ఞానులను చేసిందో, శాంతి తృప్తులను వారి రూపంలో మూసపోసిందో అట్టి ప్రకృతి, పామరుల పాలిట దుఃఖసాగరంగా పరిణమిస్తుంది. అంటే ఇదే ప్రపంచంలో ఆత్మానందంతో తేలిపోయే వాళ్ళూ ఉన్నారు, అన్నీ ఉన్నా ఏ ఒక్కటో దొరకలేదని బాధపడుతూ ఉండేవాళ్ళు ఉంటారు. అందువల్ల ఎప్పుడూ అసంతృప్తి, అభద్రతాభావం ఉంటుంది. కాబట్టి ఈ ప్రకృతి మన పాలిట దుఃఖసాగరంగా పరిణమిస్తుంది.

ఈ సృష్టిలోని అసంఖ్యాకమైన జీవులలో అదృష్టవశాత్తు వివిధ స్థాయిలలో ఆధ్యాత్మిక పరిపాకం గలవారు కూడా ఉంటారు. పూర్ణ గురుని సాన్నిధ్యం ప్రతివారికి లభ్యం కానప్పటికీ, శాంతి తృప్తులు కుదిర్చే ఆధ్యాత్మిక జీవనం ఒకటి ఉన్నదని మనకు తెలిపేవారు కొందరు ఉంటారు. ఇట్టి వారి సాంగత్యం శుద్ధ పాడ్యమి నుంచి నానాటికి అభివృద్ధి చెందే చంద్రకళల వలె మన జీవితాల్లోకి ఆత్మజ్యోతిని ప్రసరింపజేస్తుంది. ఇక్కడ సత్సంగం యొక్క గొప్పతనం గురించి చెప్తున్నారు. సాంగత్యం అంటే స్నేహితులే కాదు “మీడియా” కూడా, దేనితో ఎక్కువ సమయం గడుపుతున్నామో, మనం అలాగే తయారవుతాం. పరిపూర్ణమైన గురువు దొరికేలోపు సత్సాంగత్యం కోసం తపించేవారు మన చుట్టూ ఉంటారు. వారి సాంగత్యం మనకు కలిగితే మన యొక్క ఆధ్యాత్మిక ప్రయత్నం జరుగుతుంది. ఈ వికాసం పూర్ణ గురు సందర్శనంతో పరిపూర్ణమవుతుంది ఈ రహస్యాన్ని తెలుపుతుంది గురుపూర్ణిమ!

ఒక పూర్ణ పురుషుని వందల మంది సేవించుకోవచ్చు కాక, కానీ ఏ ఒక్కడో వారిని అందుకోగలుగుతారు. చాలామంది కష్టాలు, కోరికలు తీర్చుకునే దగ్గరే ఆగిపోతారు. మన మనసుకి తర్ఫీదు నిచ్చుకునేందుకు వాటిని వాడుకుంటే ఎంతో మెరుగవుతాం. ఈ వికాసంలోని దశలను చంద్రకళలతో పోలిస్తే పూర్ణ వికాసం కలిగిన దశను పున్నమితో పోల్చవచ్చు. కనుక సాధకుని ప్రధాన కర్తవ్యం తన పూర్ణ గురుని పూర్ణ స్థితిని తన హృదయ ఫలకం మీద స్పష్టంగా ముద్రించుకోవడమే! అందుకు సాధనముగా గురుపూర్ణిమ నాడు సద్గురుని పూజించుకునే ఆచారం అనాదిగా వస్తున్నది. అందుకు ఉత్తమమైన సాధనం పూర్ణ గురుని చరిత్ర పారాయణ చేయడమే!

మానవ చరిత్రలో అవతరించిన ఎందరో మహనీయులు ఆయా దేశకాల కాలాలకు పరిమితమైన పరిస్థితులను అనుసరించి జ్ఞానబోధను అందిస్తూ, మానవాళిని ఉద్ధరిస్తూవచ్చారు. సకల జీవుల శ్రేయస్సు కొరకై ఆధునిక యుగంలో సకల సాధనా మార్గాల, సకల మతాల, సాంప్రదాయాల, సిద్ధాంతాల పరాకాష్టగా శ్రీ దత్తాత్రేయ స్వామి శ్రీ సాయీశునిగా అవతరించారు. పరిపూర్ణ దత్తావతారమైన సమర్థ సద్గురుడైన, సకల సాధుస్వరూపుడైన, సకల దేవతాస్వరూపుడైన శ్రీ సాయి అవతరణే మానవాళికి నిజమైన గురుపూర్ణిమ అని చెప్పవచ్చు.

ఎందుకంటే సకల జీవులు, దేవతలు, యావద్విశ్వం తమ రూపమేనని, భగవంతుడు మానవులందరికీ ఒక్కడేనని, ఆయనను ఆరాధించడానికి మతభేదం అప్రస్తుతమని తెలుపుతూ, ప్రతిమతస్తునికి అతని మత జీవిత పరాకాష్టను తనలో చూపిన వేరొక గురుస్వరూప మేదీ చరిత్రలో కనిపించదు. అందుకే పాల్ రెప్స్ అనే పాశ్చాత్య పండితుడు, శ్రీ సాయి అవతరణ మానవజాతి యొక్క ఆధ్యాత్మిక చరిత్రలోనే మైలురాయి వంటిదని, నూతన యుగానికి నాంది అని అన్నాడు. అంతటి మహనీయుని అనుగ్రహాన్ని



చవిచూసిన మనం గురు పూర్ణిమను సార్థకం చేసుకుందాం. “తల్లికి తగ్గ బిడ్డలు కండి మీ ఆధ్యాత్మిక ధనాగారాలను నింపుకోండి” అన్నారు సాయి – అనే చివరి వాక్యంతో వ్యాసాన్ని ముగించి, అందరి తరపున శ్రీమతి వేదవతి గారు గురుపూజను ప్రారంభించారు.

పూజానంతరం శ్రీమతి వేదవతిగారు తిరిగి సత్సంగం చేస్తూ, ఇవాళ చేసిన నామావళిని గమనించినట్లయితే అందులో ఉపోద్ఘాతం చదివి ఉంటే, ఇవాళ పూజ్యశ్రీ మాస్టరుగారు ఏదైతే సందేశం ఇప్పుడు చదివిన వ్యాసంలో ఇచ్చారో, అది హృదయగతం చేసుకోవడానికి చక్కటి ఉపకారణంగా ఉపయోగపడుతుంది. పూజా విధానంలో పెద్దనామావళి అర్థంతో చేసుకోవాలి, అది కుదరకపోతే 108, దానికి సమయం లేకపోతే 16, ఇది వరుస,,, కానీ మనం వ్యతిరేక దిశలో మొదలుపెడతాం. పూజ్యశ్రీ మాస్టరుగారు మానసిక పూజ శ్రేష్టం అని చెప్పారు. అంటే ఆ నామావళిలో భావాన్ని హృదయగతం చేసుకుని పూజ చేసుకోవాలి. చిన్నప్పుడు నక్షత్రాలను చూసి ఆనందించి వాటిని లెక్కపెట్టడానికి ప్రయత్నం చేయని పిల్లలే ఉండము. కానీ ఇప్పుడు ఆ నక్షత్రాలే పట్టించుకోము ఈ నామావళి లాగానే,, కాబట్టి నామావళిని, పూజ్యశ్రీ మాస్టరుగారి రచనలను హృదయగతం చేసుకోవడానికి ప్రతిరోజు కొంత సమయం కేటాయించి ఆత్మ విమర్శతో దాన్ని జోడిస్తే అప్పుడు మాత్రమే మనం చేసే ప్రతి సాధన సజీవంగా ఉంటుంది.

అట్లాంటి ప్రయత్నం మన అందరి మనసులలో కల్పించి, వారికి నచ్చిన బిడ్డలుగా తీర్చిదిద్ది, జన్మ జన్మలకు చేయి పట్టి నడిపించమని మహాత్ములందరినీ కోరుకుంటున్నాను – అంటూ తమ సత్సంగాన్ని ముగించి, భజన చేసి, ఆనాటి గురుపూర్ణిమ మహోత్సవానికి ముగింపు పలికారు. ●

# వార్తాలాపము

(గత సంచిక తరువాయి)

**శ్రీమతి అడిదం వేదవతి**

*శ్రీ ప్రకాశానంద స్వామివారిచే విరచితమైన వార్తాలాపమనే యీ గ్రంథము గ్రాంథికభాషలో వ్రాయబడి వుండటం వలన తమకు అర్థంగావడం లేదని చాలామంది పాఠకులు అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. అందుకని పాఠకుల అభ్యర్థన మేరకు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ప్రియపుత్రిక శ్రీమతి అడిదం వేదవతిగారు సరళమైన భాషలో ఈ గ్రంథాన్ని పాఠకులకు అందజేస్తున్నారు - ఎడిటర్.*

## 16వ ప్రసంగము

తరువాతి రోజు ఉదయం అందరూ వచ్చిన తరువాత త్ర్యంబకభాయి జయంతీబాయితో యిలా అన్నాడు. "నిన్నటి ప్రసంగము అసంపూర్ణంగా వుండిపోయింది. దానిలో మిగిలిన విషయాలు అడిగినట్లయితే మీ సందేహాలు నివృత్తి అవుతాయి."

జయంతీ:- నిన్న జరిగిన ప్రసంగపు చివరి భాగం నాకు జ్ఞాపకం లేదు.

### జ్ఞాపకము ఉంచుకోని శిష్యులు

స్వా॥ ప్ర॥: (వినోదంగా) ఒకప్పుడు ఒక గురువు శిష్యునికి బ్రహ్మవిద్యను ఉపదేశిస్తూ వున్నాడు. ఆ సమయంలో ప్రక్కనే వున్న ఒక చిల్లు నుండి రెండు ఎలుకలు వస్తూ పోతూ వున్నాయి. శిష్యుడు అదే చూస్తున్నాడు. గురువు ఉపదేశము పూర్తయిన తరువాత శిష్యుడితో "ఏమిటి? పూర్తిగా లోపలకి వెళ్ళిందా?" అన్నాడు.

శిష్యుడు:- ఆఁ, లోపలికి వెళ్ళాయి.. కానీ కొంచెం తోక మాత్రం బయటే వుంది!

అది విని అందరూ పకపకా నవ్వారు.

### ద్రవ్యనారాయణుని ఉపాసన
(ధన ఉపాసన)

"అదే విధంగా మీ మానసిక వృత్తి ధర్మ చర్చలో లేదు. ద్రవ్య (ధనము) చర్చలో వుంది. ధనం సంపాదించడమే మీ ధర్మము.

**శ్లో॥ టకా ధర్మష్టకా కర్మ,**
**టకా హి పరమం పదమ్।**
**టకా యస్య గృహే నాస్తి,**
**హాటకా టక్ టకాయతే॥**

భావం: ధనమే ధర్మము. ధనమే కర్మ. ధనమే సర్వశ్రేష్ఠ పదము. ధవము లేని ఇంటిలో కుండ టకటకలాడుతుంది.

ధనవంతులను చూసినప్పుడు వారిలాగా ధనముంటే సుఖాన్ని అనుభవించవచ్చు అని అనిపిస్తుంది. ఇలా మీ ధర్మము, కర్మలన్నీ ధనము మీదే ఆధారపడి వున్నాయి. ఉదయం నుండి సాయంత్రం వరకూ ధనమనే ఒకే ఒక

నారాయణుని (ద్రవ్యనారాయణుని) భజించడంలో మీరు నిమగ్నులై వున్నారు. శ్రీమన్నారాయణుడు 16 కళలు కలవాడు. అయినా ఆయన పరోక్ష సత్తాత్మకుడైనవాడు (పరోక్షమైన శక్తి కలవాడు). కానీ ఈ ప్రత్యక్ష నారాయణుడు మాత్రము 16 అణాలు అనే ప్రత్యక్ష కళలు కలవాడు. ఒకానొక కవి ఇలా వర్ణించాడు.

**శ్లో॥ అనా అంశకలా ప్రోక్తా**
**రూప్యోఽసౌ భగవాన్ స్వయమ్।**
**అతస్తం సర్వ ఇచ్ఛంతి**
**రూప్యం హి గుణవత్తమమ్॥**

భావం:- రూపాయి అనే భగవంతుని యొక్క 16 కళలు పదహారు అణాలే. రూపాయి సాక్షాత్తూ శ్రీమన్నారాయణుని స్వరూపం. రూపాయి సకల ఉత్తమ గుణాలు కలిగిన సగుణబ్రహ్మము. కాబట్టి ఆ భగవంతుని అందరూ కోరుకుంటారు.

మానవులు ఈ ద్రవ్యనారాయణుని ఉపాసించడానికి అలవాటు పడినప్పటినుంచి నిజమైన నారాయణుడు దూరమైపోయాడు. ఆయన విలువ తెలుసుకోడానికి ఎవరూ ప్రయత్నించడం లేదు.

## నారాయణోపాసన కాదు, లక్ష్మీ ఉపాసన

ఒకసారి మాటల సందర్భంలో లక్ష్మీదేవి విష్ణుమూర్తితో యిలా అన్నది – "ప్రపంచమంతా నన్నే భజిస్తోంది. ఎవరూ మిమ్మల్ని తలచడం లేదు". నారాయణుడు అలా కాదన్నాడు. లక్ష్మీదేవి "అయితే బయలుదేరండి. పరీక్షించి చూడండి!" అన్నది.

తరువాత నారాయణుడు మహావిద్వాంసుడు, మహా తేజోవంతుడైన సన్యాసి రూపం ధరించి ఒక గ్రామానికి వెళ్ళాడు. అతని చేతిలో కమండలము మొ॥న వాటిని చూసి ప్రజలందరూ అతని వెంటబడ్డారు. 'అలౌకిక మహాపురుషుడు' అని ఆయన కీర్తి నాలుగు దిక్కులా వ్యాపించింది. ఆయన అక్కడేవున్న బ్రాహ్మణ అగ్రహారానికి వచ్చాడు. లక్ష్మీదేవి యోగిని రూపం ధరించి తెల్లటి వస్త్రాలు, మెడలో తులసిమాల మొ॥నవి ధరించి ఆ గ్రామంలోనే వున్న ధర్మశాలకు వచ్చింది. ఆమెను చూసి చాలామంది ఆమెను భిక్షకు తమ ఇండ్లకు ఆహ్వానించారు.

ఆమె భిక్షకు వెళ్ళిన ప్రతి ఇంటిలోనూ "మీ సంసారుల ఇండ్లలో నేను భోజనం చేయను" అని చెప్పి తన సంచి నుంచి పది, పదిహేను వేల విలువ కల కంచము, గిన్నెలు, చెంబు మొ॥నవి తీసుకుని వాటిలో భోజనం చేసి వాటిని ఆ ఇంటిలోనే వదిలేసి వచ్చేది.. ఇక చెప్పవలసినదేమున్నది? ఆమె పట్ల ఆకర్షణ వల్ల నారాయణుని దర్శనం కోసం వెళ్ళేవారి సంఖ్య తగ్గసాగింది. ఆ తరువాత ఆమెను నారాయణుడు వున్నచోట భిక్షకు రమ్మని ఆహ్వానించారు.

ఆమె వారికిలా చెప్పింది – "నేను మీ అగ్రహారానికి భిక్షకు రాను. మీ వూర్లో వున్న సన్యాసిని వెళ్ళగొడితేనే నేనక్కడికి వస్తాను".

అది విని బ్రాహ్మణులిలా అన్నారు – "ఆయన మహావిద్వాంసుడు. ఆయనను బయటకు ఎలా వెళ్ళగొడతాము?"

లక్ష్మీదేవి:- "వారు ఎలాంటివారైనా కానీయండి. వారు కాలుపెట్టిన చోట నేను కాలు పెట్టను".

బ్రాహ్మణులు అది విని యిలా అన్నారు – "సరే! మీరు చెప్పినట్లే చేస్తాము. మీరు తప్పకుండా దయచేయండి!"

యోగిని బ్రాహ్మణులతో వెళ్ళింది. బ్రాహ్మణులు సన్యాసి రూపంలో వున్న నారాయణుని ఆ స్థానాన్ని విడిచి వెళ్ళమని చెప్పారు. నారాయణుడు వారితో యిలా అన్నాడు – "మొదట మీరు నేను జీవించి వున్నంత కాలమూ యిక్కడే వుండాలని చెప్పారు కదా! ఇప్పుడు వెళ్ళమంటున్నారేమిటి? నేను వెళ్ళను!".

చివరకు ఆ బ్రాహ్మణులు బలవంతంగా సన్యాసిని వెళ్ళగొట్టారు. నారాయణుడు వెళ్ళిన ప్రతి గ్రామానికీ లక్ష్మి వెళ్ళి ఆ గ్రామం నుంచి ఆయనను వెళ్ళగొట్టించింది.

ఆ తరువాత యోగిని నారాయణుడిని యిలా అడిగింది – "ఏమండీ! జగత్తులో ఎవరు గొప్పవారనుకుంటున్నారు?" నారాయణుడు నవ్వాడు. ఇది విని అందరూ నవ్వారు.

అప్పుడు త్ర్యంబకభాయి చెప్పాడు – "నిన్న చివరి భాగంలో ప్రసంగము సాత్త్వికత్వానికి సంబంధించి జరిగింది. శ్రీప్రకాశానందస్వామివారు శ్రీనిత్యానందస్వామివారిని ఈ విషయంలో ఏమైనా చెప్పమని కోరారు. కానీ వారు శ్రీ ప్రకాశానంద స్వామివారిపైనే ఆ భారాన్ని మోపారు.

**- సశేషం**

# బుద్ధ ధ్యాన హృదయము

(గత సంచిక తరువాయి)

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

## అధ్యాయం - 5

### శిక్షణాక్రమము

ఆయా పనులు చేసేటప్పుడు తనలో కలిగే సుఖ, అసుఖాది భావాలను గుర్తించాలి (వేదనానుపశ్యనము). ఈ స్మృతిని చెదరగొడుతూ యితర యోచనలు, ఊహలు కలిగినపుడు అలా జరగడాన్ని గుర్తించాలి (చిత్త స్మృతి: ఏకాగ్రత లేని మనస్సు అని గుర్తిస్తాడు). అప్పుడు కలిగిన కోరికను వుదాహరణకు తింటున్నప్పుడు కలిగే దాన్ని గుర్తిస్తాడు. ఇది కోరికతో కూడిన మనస్సు అని చిత్తానుపశ్యనం చేస్తాడు. ఇది విషయేచ్ఛ అనే అవరోధమని, నాలుక రుచుల సంపర్కం చేత జనించిన బంధమని గుర్తిస్తాడు. ఈ రెండూ కలసి మనోవిషయస్మృతి. కొద్దిలో చెప్పాలంటే యెప్పటికప్పుడు సంభవించే మానసిక, శారీరక సంఘటనలను స్మృతితో అనుభవించాలి. ఆ విధంగా ప్రతివిషయంలోను స్మృత్యుపస్థానం లోని విభాగాలైన నాలుగు ధ్యానాలను అన్వయించుకుంటాడు.



ఇంత వివరంగా స్మృతి సాధన చేసినప్పుడు నిత్యకృత్యాలన్నీ చాలా నెమ్మదిగా కొనసాగుతాయి. ఇది ప్రత్యేక సాధనా కాలంలోనే సాధ్యమౌతుంది. నిత్య జీవితంలో అప్పుడప్పుడు మాత్రమే సాధ్యమౌతుంది. అయినా అప్పుడు కలిగే అనుభవం దాని ప్రభావం అనేక ప్రయోజనాలు కలిగి వుంటుంది.

నిత్యజీవితంలో, నిత్యకృత్యాలలో స్మృతిని యింత సూక్ష్మంగా అన్ని పనులలోని సూక్ష్మతర అంశాలపట్ల పనిచేయించనక్కరలేదు. అలా చేస్తే పనులు మరీ ఆలశ్యమౌతాయి. స్థూలంగా యీ పనులన్నింటితో స్మృతి కూడి వుండి అప్రయత్నంగా వాటిలోని యే అంశాలు స్మృతికి గురి అవుతాయో వాటిని గుర్తిస్తేచాలు.

స్మృతిని ఈ విధంగా వినియోగించటంలోని ప్రథమ లక్ష్యం యెఱుకను, ఏకాగ్రతను బలపరచి తెంపులేకుండా కొనసాగే వివిధములైన శారీరక మానసిక క్రియలను, భావాలను అంతకంతకు యెక్కువసేపు గుర్తించడం. యెప్పుడైనా అంతరాయం కలిగినపుడు దానినికూడా గుర్తించడం. అలా అంతరాయాన్ని గుర్తిస్తే స్మృతి తెంపులేకుండా కొనసాగినట్లే. అయితే యీ అంతరాయాన్ని అది కలుగుతుండగానే గాని, లేక వెంటనేగాని గుర్తిస్తే మాత్రమే స్మృతి కొనసాగినట్లు. మొదట అలా గుర్తించక అంతరాయంగా పరిణమించే యోచనల్లో కొట్టుకుపోవడం జరుగుతుంది. అలా జరుగకుండా చూచుకోగలిగితే సామాన్యస్మృతిసాధన ఆరంభకులకు తృప్తిగా కొనసాగినట్లే.

- సశేషం

(గత సంచిక తరువాయి)

# భగవాన్ శ్రీ భరద్వాజ

శ్రీమతి శ్రీదేవి

## అధ్యాయం - 5

## సాధన - పరిశోధన

భరద్వాజగారు సహ్యాసహ్య విచక్షణ లేక యితరులు తినలేని ఆహారాన్ని ఏహ్యాభావంలేక తినగలిగారంటే ఆయన అప్పటికే తమ శారీరక మానసిక స్థితులను నియంత్రించుకొనగల శక్తిసంపన్నులై వుండటమే అందుకు కారణం. ఆకలి తీర్చుకొని ప్రాణాన్ని నిలుపుకొనటమనే ధర్మనిర్వహణలో భక్ష్యాభక్ష్య విచక్షణను, జిహ్వాచాపల్యాన్ని అధిగమించటం ఆ జితేంద్రియునకు అసాధ్యం కాదు.

శ్రీ సాయినాథుడు తాము తెచ్చుకున్న భిక్షాన్నాన్ని మశీదులోని కుండలో వేసి అన్ని పదార్థాలను విచక్షణ లేకుండా కలిపి అందునుండి మశీదులో పనిచేసే సేవకులు, భిక్షగాళ్ళే కాక, కుక్కలు, పిల్లులు, కాకులు వంటి జంతువులు కూడా స్వేచ్ఛగా తమకు కావలసినంత భుజించిన తర్వాత చివరగా తాము ఒకటి రెండు ముద్దలను మాత్రమే గ్రహించేవారు.

అక్కల్ కోట స్వామివారు ఒకసారి భక్తులు తమకు నివేదించిన మధుర పదార్థాలను భుజిస్తుండగా చూచిన ఒక వ్యక్తి తన మనసులో 'స్వామికి కూడా యింతటి జిహ్వా చాపల్యమా?' అని భావించిన మరుక్షణం ఆయన ఒక్కసారి అతనివైపు చూసి నవ్వి ఒక భక్తుని పిలచి ఒక పళ్ళెం నిండా పచ్చిమిరపకాయలు తెప్పించుకొని ఎంతో ప్రీతిగా ఆరగిస్తారు. అది చూచిన వ్యక్తి తన తప్పిదాన్ని గ్రహిస్తాడు.

శ్రీ కాళహస్తిలోని గోపాలస్వామి అనే అవధూత ఆహారాన్ని భుజించే కంచంపై పెట్టుకున్నంత సహజంగా మట్టి నేలపై పెట్టుకొని ఆ మట్టి, యిసుక కలసిన ఆ ఆహారాన్ని ఎంతో ప్రీతితో ఆరగించేవారు.

సంకల్పమాత్రాన మాంసాహారాన్ని ఖర్జూరపండ్లు, గులాబీ పువ్వుల వలె మార్చగలిగారు శ్రీ మాణిక్య ప్రభువు.

భక్ష్యాభక్ష్యములు, సహ్యాసహ్యములు అనేవి మనవంటి మానవ మాత్రులకే గాని సకల సృష్టీ తామే అయిన ఆ మహనీయులకు ఆ విచక్షణలు ఎలా వర్తిస్తాయి?

ఒకసారి భరద్వాజగారు ఎప్పటివలెనే కొద్దిరోజులు ధ్యానసాధనలో గడపాలని సంకల్పించి అడవికి బయలుదేరారు. ఆ విషయం తెలుసుకొన్న ఆయన స్టూడెంట్స్ కొందరు తమకు కూడా ఆ నిర్జనారణ్యంలో ధ్యానం చేసుకొనాలని వున్నదని చెప్పి ఆయన వెంట వెళ్ళారు. అందరూ అడవి చేరుకొని ఒక చెట్టుక్రింద కూర్చుని ధ్యానమగ్నులై కొంతసేపు గడిపారు. సంధ్యాసమయం ఆసన్నమైంది. నలుదెసలా చీకట్లు ఆవరించాయి. ఎటు చూసినా చెట్లు, పుట్టలు, పొదలతో నిండి మనుష్య సంచారమే లేని ఆ కారడవిలో చెట్లపైని పక్షుల సవ్వడి తప్ప అంతటా నిశ్శబ్దం అలముకొన్నది. అప్పుడప్పుడు వినిపించే అడవి జంతువుల అరుపులు భీతి కలిగిస్తుండగా ఆ చిమ్మచీకటిలో ఆ కొత్త పరిసరాలలో విద్యార్థులలో తెలియని భయం ఆవరించింది. అయితే తమ చెంతనున్న తమ మాస్టర్ దైవశక్తి సమన్వితుడనీ, ఆయన అండనుండగా తమకేమీ ప్రమాదం వాటిల్లదన్న

నమ్మకంతో విద్యార్థులంతా నిద్రకుపక్రమించారు. ఇంతలో – ఎక్కడో దూరం నుండి పెద్దగా పులి గర్జన వినిపించింది. అంతే! విద్యార్థుల గుండెలు భయంతో దిగజారిపోయాయి. వారి నిద్ర చెదరిపోయింది. వారి భయాన్ని గమనించిన భరద్వాజగారు వారితో భయపడనవసరం లేదనీ, నిశ్చింతగా నిదురపొమ్మనీ, తాము వారికి కాపలాగా తెల్లవార్లూ మేలుకొని వుంటామనీ ధైర్యం చెప్పారు. వంతులవారీగా తెల్లవారుఝాము వరకు ఆయన మేల్కొని వుండేటట్లూ, అప్పటినుండీ తెల్లవారే వరకు విద్యార్థులు మేలుకొని కాపలా వుండేటట్లు వారంతా నిర్ణయించుకొన్నారు. విద్యార్థులు నిద్రకుపక్రమించారే గానీ వారికి ఏ మాత్రం నిద్రపట్టలేదు. రాత్రంతా వారి వద్దనే మేలుకొని వున్న భరద్వాజగారికి తెల్లవారుఝామున పడుకోగానే కొంచెం కునుకుపట్టింది. తెలతెలవారుతుండగా ఆయనకు నిద్ర మెలకువ వచ్చింది. ఆశ్చర్యం! అంతకుముందు కొంతసేపటి వరకు తమ చెంతనే పడుకొని వున్న విద్యార్థులెవ్వరూ కనిపించలేదు. వీళ్ళంతా ఏమైనారా అని వారిని వెదుకుతూ వెళ్తుండగా ఆయనకు ఆ వైపుగా కొందరు కోయజాతి వాళ్ళు వెళ్తూ కన్పించారు. ఆయన వారిని పిలిచి విద్యార్థుల గురించి అడుగగా ఆ కోయవాళ్ళు తాము కొందరు కుర్రవాళ్ళను చూశామని, వాళ్ళంతా అడవి నుండి ఊరిలోకి వెళ్ళే ప్రయత్నంలో దారితప్పి యింకా అడవి నట్టనడి మధ్యకు సాగిపోతుంటే తామే వారికి దారి చూపించి వస్తున్నామనీ చెప్పారు.

అలా చెపుతూ ఆ కోయదొరలు ఒక్కసారి భరద్వాజగారి వైపు తేరిపార చూశారు – 'పచ్చని దేహచ్ఛాయతో, చిగురుటాకు వంటి లేత శరీరంతో, దివ్య తేజస్సుతో వెలిగిపోతున్న యీ స్ఫురద్రూపి అయిన యువకుడెవరు? వింతకాంతులీనుతూ చల్లగా పలుకరించే ఆ కన్నులు, తేనెలొలికే ఆ కంఠస్వరం, ఎల్లజనుల పట్ల ఆత్మీయతను ప్రతిధ్వనింపజేసే ఆ పలకరింపు – ఇతడు ఏ ఋషి కుమారుడో! లేక మానవ రూపం దాల్చిన ఏ దేవ గంధర్వుడో! మా పుణ్యం పండి మా కోసమే దివినుండి యీ అడవికి దిగి వచ్చినట్లున్నాడు! ఒకటి మాత్రం నిజం! ఇతడు సాధారణ మానవుడు ఎంత మాత్రం కాదు. ఒక సామాన్య మానవుడు క్రూర మృగాలతో నిండిన యీ కారడవిలో యిలా ఒంటరిగా, నిర్భయంగా, ప్రశాంతంగా నిలువగలడా? అనుకొన్న ఆ కోయదొరలు ఆయనకు చేతులు జోడించి ఎంతో వినయంగా, "స్వామీ! మీరెవరు? ఇక్కడెందుకున్నారు?" అని అడిగారు. భరద్వాజగారు తాను నగరంలో నివసించే ఒక ఉపాధ్యాయుడనని, యిందాక వాళ్ళు చూసిన కుర్రవాళ్ళు తన దగ్గర చదువుకునే విద్యార్థులని, తాను అప్పుడప్పుడు అడవికి ఒంటరిగా వచ్చి కొన్నాళ్ళు తపస్సు చేసుకొని వెళ్తుంటాననీ, ఈసారి వస్తున్నప్పుడు యీ విద్యార్థులు తాము కూడా అడవిలో తపస్సు చేసుకొంటామని వచ్చి, రాత్రి పులి గర్జన విని భయపడి, తాను నిద్రిస్తున్నప్పుడు తనకు చెప్పకుండా వెళ్ళిపోయారనీ చెప్పారు.

ఆ మాటలన్నీ విన్న ఆ కోయవారి ఆనందానికి అవధుల్లేవు. 'తాము ఊహించినట్లు యితడు ఋషి కుమారుడే! అడవుల్లో భయం లేకుండా తపస్సు చేసేది ఋషులే కదా! ఎంతో పుణ్యఫలంగా దొరికిన యీ మహాత్ముని సేవించుకొనే భాగ్యాన్ని ఎంత మాత్రం జారవిడుచుకోకూడదు' అనుకొని ఎంతో పుణ్యాత్ములు, భాగ్యశాలురు అయిన ఆ కోయదొరలు పరుగు పరుగున తమ గూడెం చేరుకొని రకరకాల తళుకు బెళుకులతో, తళతళా మెరిసే పొడవైన నెమలి ఈకలతో అలంకరించిన పూల పల్లకీ తీసుకొని, తమ వారందరినీ తోడ్కొని, పూజా సామాగ్రులతో, మేళతాళాలతో భరద్వాజగారి వద్దకు వచ్చారు. ఆయన వారిస్తున్నా వినకుండా ఆ కోయజాతి స్త్రీ, పురుషులందరూ పెద్ద పెద్ద గంపలనిండా తెచ్చిన అందమైన రంగురంగుల, రకరకాల సువాసనలు వెదజల్లే అడవి పువ్వులతో, పూలదండలతో ఆయనను ముంచెత్తారు.

ఆ ప్రభాత సమయంలో, చుట్టూ వున్న పచ్చని ప్రకృతి పరవశంతో చూస్తుండగా ఆ అమాయకులు, నిష్కల్మష హృదయులు అయిన ఆ కోయవారు ధూప దీప నైవేద్యాలతో, భక్తితో ఆయనను పూజించి, పూల పల్లకిలో ఎక్కించుకొని, దారి పొడుగునా భక్తి గీతాలు,

భజన పాటలు పాడుతూ మంగళ వాయిద్యాలతో తమ గూడేనికి తీసుకొని వెళ్ళారు. ఆయనకు తపస్సుకు ఎంతో అనువైన ప్రదేశాన్ని చూపించారు. ఆయన అక్కడ వున్నన్ని రోజులూ ఆవుపాలు, పుట్టతేనె, మధుర ఫలాలు, వెదురు బియ్యంతో వండిన అన్నంతో, ఎంతో రుచికరమైన శాఖాహార వంటకాలతో అత్యంత ప్రేమానురాగాలతో ఆతిథ్యమిచ్చి సత్కరించారు. భరద్వాజగారు తిరిగి తమ ఊరు వెళ్ళిపోతున్నప్పుడు, తమ దైవం, తమ ప్రాణం తమను విడిచి దూరమైపోతున్నట్లు ప్రతి ఒక్కరూ బాధతో విలవిలలాడిపోయారు. తమపై దయతో తమ చెంతకు అప్పుడప్పుడూ విచ్చేయవలసిందిగా మరల మరల ప్రాధేయపడ్డారు. దారి పొడుగునా జేజేలు చెపుతూ అడవి దాటించి నగరం వరకు ఆయనను సాగనంపి బస్సు ఎక్కించి, కన్నీటితో వీడ్కోలు చెప్పారు. ఎల్లవేళలా తమను కనికరించి పాలించమని చేతులు జోడించి ప్రార్థిస్తూ తమ తమ యిళ్ళకు మరలి వెళ్ళారు.

కలుషితమైన నగర వాతావరణానికి దూరంగా వుండే కపటమెరుగని, నిష్కళంక హృదయులైన ఆ అడవి తల్లి ముద్దుబిడ్డలు మలినాలంటని స్వచ్ఛమైన తమ అంతరంగాలలో దత్తావతారులైన శ్రీ భరద్వాజగారిని దైవంగా గుర్తించ గలిగారు. మనసారా ఆయనను సేవించి ధన్యులైనారు.

ఈ విధంగా కఠిన సాధనలతో, తీవ్ర తపోనిష్ఠతో, పరమార్థాన్ని సాధించాలన్న తపనతో అకుంఠిత దీక్షతో సాగుతున్న ఆయన పరిశోధనలో మరొక రెండు సంవత్సరాల కాలం గడచిపోగా రెప్పవేయక, ఎంతో ఏకాగ్రతతో లక్ష్యం వైపే దృష్టి సారిస్తున్న ఆయన అంతఃచక్షువులకు సత్య స్వరూపాన్ని దర్శించే శుభ ఘడియలు సమీపించాయి.

శోకంతో క్షాళితమై, శోధనతో తప్తమైన ఆయన హృదయం సద్గురువు ప్రసాదించబోయే దివ్యానుభవంతో పవిత్రమై పరంజ్యోతిగా ప్రజ్వరిల్లి లోకానికి ఆధ్యాత్మిక వెలుగులు అందించేందుకు సన్నద్ధమైంది.

**- సశేషం**

## సాయిచర్యలు- ధర్మానికి దీపాలు

౦3వ పేజీ తరువాయి

వారూ లౌకిక ప్రయోజనాన్ని మాత్రమే కోరుతారు. తరువాతి రెండు రకాలవారూ ఆయన అనుగ్రహరూపమైన పరమార్థాన్నే కోరుతారు. మొదటి రెండురకాల వారికి స్వప్రయోజనంపై ప్రీతి ఎక్కువ. తరువాతి రెండురకాల వారికి భగవంతుని మీదనే ప్రీతి ఎక్కువ. పైలీల లోని ఇద్దరు స్త్రీలు యీ రెండు వైఖరులకూ ప్రతినిధులు. భక్తులందరికీ భగవంతుడు –వారు తన్నెందుకు ఆశ్రయించినా– యిహపరాలను అనుగ్రహిస్తారు. కొందరు భక్తులు అజ్ఞానము వలన లౌకిక శ్రేయస్సును మాత్రమే స్వీకరిస్తారు. వివేకులు ఆయనపట్ల భక్తి వలన ఆయన యిచ్చిన యిహపరాలు రెండింటినీ పొందగలుగుతారు.

అంతేకాదు. చేసిన పనికి, యిచ్చిన వస్తువుకి వెలను మాత్రమే చెల్లిస్తారు మానవులు. అందులో గూడా సాధ్యమైనంత బేరమాడి వీలైనంత తక్కువ ధరను చెల్లింపచూస్తారు.

భగవంతుడు తన అనుగ్రహాన్ని నిర్హేతుకంగా జీవులకు ప్రసాదిస్తాడు. అంటే మన చేతలద్వారా, సాధనద్వారా మనము సాధించుకోగలిగేదికాదు భగవదనుగ్రహము. మన మేమీ చేయకున్నా గాలి, నీరు, వెలుగులను ఆయన అందరికీ ప్రసాదిస్తూనే ఉన్నారు. పనిచేయగల దేహాన్ని, మనస్సునూ ప్రసాదించాడు. మనము తెలుసుకోగలగాలే గానీ అపారమైన జ్ఞానాన్ని, దివ్యశక్తినీ మనలో పొందుపరిచాడు. ప్రబోధించడానికి శాస్త్రాల రూపంలోనూ, మహాత్ముల రూపంలోనూ నిరంతరము ఆయన కృషి చేస్తూనే వున్నాడు. సాధన అంతా ఈ వాస్తవాన్ని గుర్తించి మనదృష్టిని, జీవిత విధానాన్నీ సరిచేసుకొనడమే.

ఈ లీలలో మొదటి స్త్రీ రెండవామెను చూచి అసూయ పడనక్కరలేదు. భగవంతుడు యిద్దరికీ సమానంగానే యిచ్చాడు. లోపం అంతా తన దృష్టి లోనిదే. తనకు రావలసినది రెండవామెకు చెందితే గదా ఆమె బాధపడాలి? సాటివారికి సాయినాథుడు అనుగ్రహించిన జ్ఞానానికి, అనుభవాలకూ అసూయచెందనవసరం లేదు. నిర్హేతుకమైన ఆయన దయకు కృతజ్ఞుల మవగలిగితే చాలు.●

(గత సంచిక తరువాయి)

# శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు

**శ్రీమతి శ్రీదేవి**

శ్రీ ఆనందమయి అమ్మ తరచు యీ క్రింది భజనలు యెంతో యిష్టంగా చేసేవారు–

1. **భజరే భయ్యా రామగోవింద హరే। రామగోవింద హరే, రామగోవింద హరే, రామ గోవింద హరే। భజరే బహినా రామగోవిందహరే। జో సుఖ రామనాహి సోముఖ ధూల్ పదే। భోలత్ గతరీ, భజరే భయ్యా, రామగోవింద హరే, రామ గోవింద హరే।**
2. **రఘుపతి రాఘవ రాజారామ్ పతిత పావన సీతారామ్। సీతారామ్ జయ సీతారామ్, జయ రఘునందన సీతారామ్। గౌరీశంకర సీతారామ్, వ్రజవాసీ జయ రాధేశ్యామ్। జయతు శివాశివ జానకి రామ్, జయ రఘు నందన సీతారామ్।**
3. **హరిబోల్, హరిబోల్, హరిబోల్, హరిబోల్, కేశవ, మాధవ గోవింద బోల్।।**

ఇటువంటి భక్తిగీతాలను, భజనలను శ్రీ ఆనందమయి అమ్మ యెంతో తన్మయత్వంతో ఆలపించేవారు. స్వయంగా తాను భజన చెపుతూ భక్తుల చేత భజన చేయించేవారు. ఒక్కొక్కసారి 'హరే కృష్ణ, కృష్ణ కృష్ణ' అంటూ యీ ఒక్క నామాన్నే రాగయుక్తంగా తన మధుర కంఠధ్వనితో చెపుతుంటే భక్తులు తన్మయత్వంతో భజనలో లీనమై పరిసరాలనే మరచిపోయేవారు. అమ్మ తండ్రిగారయిన విపిన్ విహారీ భట్టాచార్యగారు కూడా యెన్నో భక్తిగీతాలు, భజనలు శ్రావ్యంగా పాడేవారు.

ఏడు రోజులు ఢాకాలో గడిపిన అనంతరం అమ్మ పారులదియా వెళ్ళారు. వృద్ధులైన యోగేష్ ఘోష్, రాయ బహదూర్ బాబు అనే భక్తుల ప్రార్థన మేరకు పారులదియాలోని వారి గృహాలకు వెళ్ళి అటునుండి కలకత్తా వచ్చారు అమ్మ. అమ్మతో సుమారు 50, 55 మంది భక్తులు కలకత్తా చేరుకున్నారు. కలకత్తాలో రాజేంద్ర స్ట్రీట్‌లో నివసించే శ్రీయుత దినేష్ వంద్యోపాధ్యాయ అనే భక్తుడు అమ్మకు, వచ్చిన భక్తులకు తన గృహంలో భోజన, వసతి సౌకర్యాలు యేర్పాటు చేశాడు. ప్రతి రోజూ అమ్మ సందర్శనార్థం యెందరో రాసాగారు. సంకీర్తనలు, ఆధ్యాత్మిక చర్చలు జరుగసాగాయి. ఒక రోజు ఒక భక్తుడు అమ్మను "అమ్మా! సాధన అంటే యేమిటి?" అని అడిగాడు. అమ్మ యిలా చెప్పారు –

"ఏ పనినైనా సాధించాలని సంకల్పించిన తర్వాత ఆ పని నెరవేరేవరకు నెరవేరేటందుకు అవసరమైన కృషిని పట్టుదలతో చేయవలసి వుంటుంది. ఆ కృషినే 'సాధన' అంటారు. సాధన అంటే స్వధనము అనే అర్థం కూడా వస్తుంది. తను దేనినైతే పొందాలని సంకల్పించి స్వయంకృషితో దానిని పొందుతాడో అప్పుడు అది తన స్వంతము అయిన విలువయిన సంపదగా భావింపబడుతుంది. అదే స్వధనము, అదే సాధన."

మరొక భక్తుడు గృహస్థాశ్రమం గురించి వివరించవలసిందిగా అమ్మను ప్రార్థించగా అమ్మ యిలా చెప్పారు – "ఋషులు చెప్పిన నాలుగు ఆశ్రమాలలో రెండవది గృహస్థాశ్రమం. గృహస్థాశ్రమంలో ప్రవేశించటానికి ముందు బ్రహ్మచర్యాశ్రమంలో

గురుకులాలలో గురువులు బ్రహ్మచారులకు సకల శాస్త్రాలు నేర్పి, వివేక వైరాగ్యాలను, జ్ఞానాన్నీ బోధించి, ధర్మబద్ధమైన గృహస్థ జీవితం గడిపేందుకు తగిన శిక్షణ నిచ్చేవారు. ఆ శిక్షణ వలన బ్రహ్మచారి గృహస్థ జీవితాన్ని త్రికరణ శుద్ధిగా నిర్వహించేందుకు తగిన అర్హతను పొందటం జరిగేది. అందువలన గృహస్థ జీవితంలోని బాంధవ్యాలు అతనిని ప్రలోభపరచటం గాని, మమకార బంధనాలలో చిక్కుకునేలా చేయటం గాని జరిగేది కాదు. అందువలన అతడు గృహస్థంలోని సకల ధర్మాలను తు.చ. తప్పక పాటించి, ఆ తర్వాత చెప్పబడిన వానప్రస్థ, సన్యాస ఆశ్రమ నియమాలను పరిపూర్ణంగా ఆచరించగలిగేవాడు. ఈ విధంగా మోక్షాన్ని సాధించటానికి ధర్మబద్ధమైన గృహస్థ జీవితం చాలా ముఖ్యమైనది."

కలకత్తాలో వున్నపుడు ఒక రోజున అమ్మ ఉదయాన ఆలస్యంగా నిద్ర లేచారు. అప్పటికే కలకత్తాలో వుద్యోగం చేస్తున్న ఒక ప్రొఫెసర్ తన అయిదు సంవత్సరాల వయసున్న కుమారుడితో అమ్మ దర్శనార్థం వచ్చి హాలులో కూర్చున్నాడు. చాలాసేపటి తర్వాత అమ్మ హాలులోకి వచ్చికూర్చున్నారు. అక్కడ కూర్చుని వున్న ఆ పిల్లవాడిని చూస్తూనే అమ్మ అతనిని దగ్గరకు తీసుకుని కన్నీరు కార్చారు. అందరూ ఆశ్చర్యంగా చూస్తుంటే అమ్మ యీ పిల్లవాడిని వారికి చూపిస్తూ "ఈ అబ్బాయి యెవరనుకున్నారు? పూర్వజన్మలో యితడు నా సోదరుడు" అంటూ యింకా కన్నీరు కారుస్తూనే వున్నారు. కొంతసేపటికి అమ్మ మరలా అతని గురించి ఇలా చెప్పారు. "పూర్వజన్మలో యేమి జరిగిందో చెపుతాను వినండి. ఒక రోజు యీ అబ్బాయిని తండ్రి బాగా కొట్టాడు. చాలా గట్టిగా కొట్టటం వలన యితని చేయికి బాగా దెబ్బ తగిలి, చేయి విరిగిపోయింది. చేయి బాగా వంకర తిరిగి పోయింది. ఎన్ని చికిత్సలు చేసినా ఆ దెబ్బల తాలూకు గాయం మానలేదు వంకర పోయిన చేయి సరిగా రానేలేదు. ఆ గాయంతోటే అతడు కొద్ది రోజులకు మరణించాడు. మరలా కొన్నాళ్ళకు ఈ తల్లిదండ్రులకు జన్మించాడు. కానీ యీ జన్మలో కూడా అతని చేతి వంకర అలాగే వుంది. ఆ గాయం తాలూకు మచ్చ కూడా అట్లాగే వున్నది, చూడండి." అంటూ అమ్మ అతని చేతిని అందరికీ చూపించారు.

ఆ ప్రొఫెసర్ "అమ్మా! పుట్టుకతోనే యీ వంకర, యీ మచ్చ చూసి మేము ఆశ్చర్యపోయాము. మేము కూడా చికిత్సల ద్వారా చేతిని మామూలు స్థితికి తీసుకురావాలని ప్రయత్నించాము, కానీ ఫలితం లేకపోయింది. దీని గురించే మిమ్మల్ని ప్రార్థించాలని పిల్లవానిని యిక్కడకు తీసుకొని వచ్చాను" అన్నాడు. అమ్మ "ఈ అబ్బాయి పూర్వజన్మలకు సంబంధించిన యెన్నో గుర్తులను చూస్తున్నాను. అయితే యితనికి యీ మచ్చ, యీ చేతి వంకర తొలగిపోవటం అనేది జరుగదు. అంతేకాదు, అసలు వీడు యింతకాలం జీవించి వుండటమే చాలా పెద్ద విషయం అని చెప్పవచ్చు" అన్నారు. ఆ మాట విన్న అక్కడి వారంతా నిర్ఘాంతపోయారు. అమ్మ మాటలలో ఆ పిల్లవానికి పెద్ద కీడు ధ్వనించటంతో ఆ ప్రొఫెసర్ నిరుత్తరుడై చూస్తూ వుండిపోయాడు. కొంచెంసేపటికి తేరుకుని అతడు దుఃఖిస్తూ, "అమ్మా! దయతో పిల్లవాడికి యెటువంటి ఆపద జరుగకుండా మీరే కాపాడాలి" అంటూ వేడుకున్నాడు. అమ్మ యేమీ మాట్లాడక మౌనం వహించారు. ఇంతలో కొందరు భక్తులు వచ్చి అమ్మకు పాదనమస్కారాలు, పూజలు ప్రారంభించారు. ఈ ప్రొఫెసర్ గారు మాత్రం అమ్మమాటలు పదేపదే గుర్తుకు వస్తుంటే తీవ్రంగా బాధపడసాగారు. అమ్మ అభయం యివ్వక మౌనం వహించటం అతనిని మరింత బాధించసాగింది. చాలాసేపు ఆలోచించి, అతడు యెలాగైనా సరే అమ్మను ప్రార్థించి, అమ్మ నుండి రక్షణ, అభయం పొందకుండా తిరిగి వెళ్ళకూడదనుకున్నాడు. కొంతసేపటికి భక్తులందరూ వెళ్ళిపోయిన తర్వాత 'అమ్మ పాదాలు పట్టుకుని యేడుస్తూ "అమ్మా! నా బిడ్డను యెలాగైనా కాపాడండి. వీడికి చేతి వంకర తీరకపోయినా ఫర్వాలేదు. చేయి యెలా వున్నా ఫర్వాలేదు. కానీ వీడికి దీర్ఘాయువు ప్రసాదించండి. వీడికి ప్రాణగండం తొలగించి రక్షించండి" అంటూ వేడుకొన్నాడు. అప్పుడు అమ్మ తన చేతి వ్రేలికి వున్న వుంగరాన్ని తీసి ఆ అబ్బాయికి యిచ్చారు. "ఈ వుంగరం యితని వ్రేలికి యెల్లప్పుడూ వుండాలి. ఏ పరిస్థితులలోనూ దీనిని వ్రేలి నుండి తీయవద్దు" అని ఆ ప్రొఫెసర్‌కు చెప్పారు. శ్రీ భోలానాథ్ గారు కూడా ఒక నియమాన్ని చెప్పి, దానిని పాటించవలసిందిగా చెప్పారు. ఆ విధంగా అమ్మ నుండి అభయాన్ని పొంది ఆ ప్రొఫెసర్ సంతోషంగా యింటికి తిరిగి వెళ్ళిపోయాడు.

శ్రీ ఆనందమయి మాత బ్రాహ్మణులకు గాయత్రీ మంత్రం జపించకపోవటం దోషమని హెచ్చరించేవారు. ప్రతిరోజూ గాయత్రీ మంత్రజపం తప్పనిసరిగా చేయాలనీ, జపం యెంత యెక్కువగా చేస్తే అంత మంచి ఫలితం

వుంటుందనీ చెప్పేవారు శ్రీ ఆనందమయి అమ్మ.

గాయత్రీ మంత్రార్థమును వివరించవలసిందిగా ఒక రోజు అమ్మను అడిగారు భక్తులు. అప్పుడు అమ్మ ఆ మంత్రము గూర్చి దాని అర్థమును గురించి యీ విధముగా చెప్పారు –

“సవితృ మండల మధ్య స్థితుడైన గొప్ప తేజస్సుతో వెలిగిపోతున్న దేముని, నా బుద్ధి, యింద్రియములు శక్తివంతములుగా వికసించుటకుగాను నేను ప్రార్థిస్తున్నాను – అని యీ మంత్రమునకు అర్థము. ఈ మహిమాన్వితమైన గాయత్రీ మంత్రాన్ని యెంత యెక్కువసార్లు జపము చేస్తే అంత విశేషంగా ఫలితాన్ని పొందగలరు.”

కలకత్తాలో వున్నప్పుడు మరొక రోజున భక్తుల మధ్య 'భగవంతుని కృప – కర్మఫలము' అనే విషయం మీద చర్చ జరిగింది. “అంతా దైవ సంకల్పమే, లోకాలను నడిపిస్తున్నది దైవమే. 'శివుని ఆజ్ఞ లేనిదే చీమ కూడా కుట్టదు' అంటారు కదా. కర్మలు చేయటం ఫలితాలు పొందటం అనేదే లేదు దైవకృపయే అన్నింటికీ మూలం” అని కొందరు భక్తులు అన్నారు. “భాగవతాది గ్రంథాలలో, పురాణాలలో కర్మ సిద్ధాంతాన్ని సమర్థిస్తున్న అంశాలు యెన్నో వున్నాయి. అందుకు దృష్టాంతాలు కూడా వున్నాయి. కనుక కర్మసిద్ధాంతం ప్రకారమే అంతా జరుగుతుంది. మానవ జీవితం అంతా అతని ప్రారబ్ధకర్మ ఫలితాల ననుసరించియే నడుస్తూ వుంటుంది” అని మరి కొందరు అన్నారు. శ్రీ ఆనందమయి అమ్మను భక్తులంతా యీ రెండు విధాలయిన వాదనలలో యేది వాస్తవమో చెప్పవలసిందిగా ప్రార్థించినపుడు అమ్మ యిలా చెప్పారు–

“ఎవరు యెటువంటి కర్మలు చేస్తారో వారు అటువంటి కర్మఫలితాన్నే పొందుతారన్నదే నిజం.”

అప్పుడు కొందరు భక్తులు అమ్మతో తమ సందేహాన్ని యీ విధంగా వ్యక్తం చేశారు. “అమ్మా!, మానవ జీవితాలలో దైవం యొక్క ప్రమేయం అంటూ యేమీ వుండదా? కష్టాలలో వున్నవారు దైవాన్ని ప్రార్థించటం, ముడుపులు కట్టటం, మొక్కులు మొక్కుకొనటం చేసినపుడు వారి బాధలు, కష్టాలు తొలగిపోవటం చూస్తుంటాము. అందువలన పాపకర్మల వలన కష్టాలు వచ్చినా, ఆ కష్టాలు తప్పనిసరిగా అనుభవించవలసివున్నా, దేముడు మ్రొక్కులు, ముడుపుల వలన ఆ బాధలు తొలగిస్తున్నాడు. కాబట్టి కర్మ సిద్ధాంతం కంటే దైవసంకల్పం, దైవకృపలకే యెక్కువ



ప్రాధాన్యత వున్నట్లు ఋజువు అవుతున్నది కదా? కనుక దైవకృప వలననే యీ సృష్టి, మానవ జీవితాలు నడుస్తాయి అనిపిస్తుంది.”

శ్రీ నందమయి మాత వారి సందేహాలకు యీ విధంగా జవాబిచ్చారు – “అంతా దైవసంకల్పం అయినట్లయితే, దైవకృపతోనే సృష్టికార్యాలు, మానవ జీవితాలు నడుస్తున్నట్లయితే, ఇక మానవులు చేసే కర్మలు, వాటి ఫలితాలు అనే అంశం వుండే అవకాశమే లేదు. అయితే జాగ్రత్తగా ఆలోచిస్తే దీని గురించి ఒక సందేహం కలిగే అవకాశం వున్నది. బాగా ఆలోచించండి, మానవులందరి జీవితాలు ఒకే విధంగా వుంటున్నాయా? వుండటం లేదుకదా, మరి దేముడే అన్నీ చేసేటట్లయితే కొందరికి కష్టాలు, మరికొందరికి సుఖాలు యెందుకు యిస్తున్నాడు! అలా చేస్తే భగవంతుడు కఠినాత్ముడు, పక్షపాతి అవుతాడుగాని, సమదర్శి, ప్రేమ స్వరూపుడు యెలా అవుతాడు? కనుక మానవుడు 'తన ప్రారబ్ధకర్మలను అనుసరించి కష్టసుఖాలు పొందుతాడు' అన్నది నిజం. ఇందులో యెటువంటి సందేహం లేదు”.

**- సశేషం**

# ద్వారకామాయి అనుభవమండపము

శ్రీమతి వణుకూరి వాణీకుమారి, హైదరాబాద్

మాది వరంగల్ దగ్గర చిన్న పల్లెటూరు. మావారు వ్యవసాయం చేసేవారు. మేము 5వ తరగతి వరకు చెప్పే చిన్న పాఠశాల పెట్టుకున్నాము. నాకు ఒక అబ్బాయి ఒక అమ్మాయి. దాదాపు 2002 వ సంవత్సరంలో, మా అబ్బాయి ఇంటర్మీడియట్ చదువుతున్నప్పుడు వాడికి ఎవరో అభయహస్తం వున్న శిరిడీ సాయిబాబా ఫోటో ఇచ్చారట. నాకు అప్పటి వరకు బాబా అంటే తెలియదు. నేను ఎక్కువగా ఇంటిపట్టునే ఉంటాను. మా స్కూలు ఇల్లు తప్ప నాకు ఇంకేమీ తెలియదు. మిగిలిన అన్ని వ్యవహారాలు మావారు చూసుకునేవారు.

మా అబ్బాయి శ్రీ సాయినాథులవారి ఫోటో తెచ్చాక చాలా శాంతిగా అనిపించింది. అది హాలులో పెట్టుకున్నాము. నేను కూడా ఇంకొక చిన్న బాబా పటం తెచ్చుకుని దేవుడి గదిలో పెట్టుకుని దీపం పెట్టుకునేదాన్ని.

2004లో మావారు కాలం చేశారు. చనిపోయే వారం రోజుల ముందు, ఆయన హాస్పిటల్ లో ఉన్నట్లు, నేను వంటరిగా ఉన్నట్లు స్వప్నం వచ్చింది. వారం తరువాత వారికి కొద్దిగా ఒంట్లో బాగోలేకపోతే హైదరాబాదులో నిమ్స్(NIMS) హాస్పిటల్ కి తీసుకువెళ్ళాం. అక్కడ వైద్యులు పరీక్ష చేస్తుంటేనే గుండెపోటు వచ్చి చనిపోయారు. నాకు విపరీతమైన బాధ, దిగులు. 'ఇదివరకులా నేను ఈ ప్రపంచంలో ఉండలేను. ఎవరూ నన్ను ఆదరించరు, పట్టించుకోరు' అని బాధపడుతూ, "బాబా! నాకు ఎవరూ లేరు నువ్వు తప్పించి, నువ్వే నాకు దిక్కు, నువ్వే నన్ను దగ్గరుండి నడిపించాలి" అని రోజూ బాబాకి ఇదే విధంగా చెప్పుకునేదాన్ని. కొన్నాళ్ళకి పిల్లలు ఇద్దరిని తీసుకొని వాళ్ళ చదువు నిమిత్తం హైదరాబాద్ వచ్చేసాను. మా ఊర్లో పొలం, ఇల్లు ఉన్నాయి. అప్పుడప్పుడూ మా ఊరువెళ్ళి అక్కడ పనులు చూసుకుని వస్తుంటాను.

అలాగే ఒకసారి వరంగల్ వెళ్లాను. తిరిగి హైదరాబాద్ వచ్చేటప్పుడు మా ఊర్లో రాత్రి 9 గంటలకి బస్సు ఎక్కాను. నాకు ఆస్తమా ఉంది. బస్సు ఎక్కి కొంత దూరం వెళ్ళాక ఆయాసం రావడం మొదలయ్యింది. నా దగ్గర ఇన్హేలర్(inhaler) అయిపోయింది. నాకు ఆయసం ఎక్కువ అవుతోంది. ఎలాగో వరంగల్ వరకు ఓపిక పెట్టాను. లోపల ఓం సాయి, శ్రీ సాయి, జయ జయ సాయి అన్న నామం ఆపకుండా చెప్పుకుంటున్నాను. ఇక అప్పుడు మాట కూడా రావట్లేదు. అప్పుడే వరంగల్ లో బస్సు ఆగింది. రాత్రి 12గంటలు అయ్యింది. నేను నెమ్మదిగా లేచి డ్రైవర్ దగ్గర కెళ్ళి వణుకుతున్న గొంతుకతో పరిస్థితి చెప్పాను. "మీరు మందుల షాపుకెళ్ళి రండి, అంతవరకు బస్సు ఆపుతాను అన్నాడు". అతను వెళ్ళి తెస్తాడేమోనని నా ఉద్దేశ్యం. నాకు ఆ చీకట్లో ఎటు వెళ్ళాలో

తెలియలేదు. వొళ్ళంతా తూలిపోతోంది. ఇక తప్పదని బాబా నే తలచుకుంటూ బస్సుదిగాను. నేను నడవడానికి కూడా చాలా ఇబ్బంది పడుతున్నాను. ఇంతలో ఎవరో ఇద్దరు అబ్బాయిలు ఆ చీకట్లో నా దగ్గరకు వచ్చి, నా పరిస్థితి చూసి, ఇద్దరూ చెరొక చెయ్యి పట్టుకుని ఆటో పిలిచి నన్ను దాంట్లో కూర్చోపెట్టారు. మందుల షాపుకి తీసుకెళ్ళమని చెప్పాను. 24 గంటలు తెరిచి ఉండే మందుల షాపుకి తీసుకెళ్లి ఇన్హేలర్ ఇప్పించారు. వెంటనే అక్కడ రెండు సార్లు పీల్చేసరికి ఊపిరి అంది స్థిమిత పడ్డాను. మళ్ళీ నన్ను తీసుకొచ్చి బస్సు దగ్గర దింపారు. బస్సు అంతవరకూ ఆపే ఉంచారు. నేను బస్సు దగ్గరకు వెళ్ళి తిరిగి చూసేసరికి వాళ్ళు లేరు. నేను బస్సు ఎక్కిన తర్వాత ఆలోచించుకుంటే... "అసలు వాళ్ళు ఎవరు? అంత రాత్రి అక్కడకి ఎందుకు వచ్చారు? వాళ్ళు రాకపోతే నా పరిస్థితి ఏమిటి?' ఇదంతా ఆలోచిస్తే అది తప్పక బాబా చేసిన సహాయమే అనిపించి కళ్ళనీళ్ళు ధారలు కట్టాయి. ఈవిధంగా బాబా నన్ను కాపాడకపోతే నా ప్రాణం ఎప్పుడో పోయేది. వారికి ఎంతటి కృతజ్ఞతలు చెప్పినా తక్కువే!

మా అమ్మాయికి మాకు తెలిసిన వాళ్ళ అబ్బాయితో పెళ్లి నిశ్చయం అయ్యింది. కానీ కొన్ని కారణాలవల్ల వాళ్ళు పెళ్లిని వాయిదా వేశారు. దాదాపుగా ఆ పెళ్లి ఆగిపోయే పరిస్థితి వచ్చింది. అప్పుడు మళ్ళీ నేను సాయిబాబా జీవిత చరిత్ర పారాయణం చేస్తూ వారినే ప్రార్థించుకునేదాన్ని. ఒకరోజు బాబా గుడికి వెడితే ఒక ఆయన నాతో, "నువ్వు మీ అమ్మాయి పెళ్లి కోసం పారాయణ చేస్తున్నావ్ కదా, ఆ సంబంధం వాళ్లే మళ్ళీ వస్తారు దిగులు పడకు" అని చెప్పారు. అలాగే వాళ్ళే వచ్చి పెళ్లి చేసుకున్నారు. అయితేవాళ్లు, పెళ్లి మా ఊర్లో చేయమని అడిగారు. నేను హైదరాబాదులో చేద్దాం అనుకున్నాను. మా ఊర్లో అయితే అన్నీ బయటినుంచి సమకూర్చుకోవాలి, ఇల్లు కూడా చాలా రోజులనుంచి మూసి ఉంచాము కనుక బాగు చేయించాలి. ఎలా చేయాలబ్బా అని బాధపడుతూ బాబా గారి మీదే భారం వేసాను. ఆయన ఎంతబాగా సహాయం చేశారంటే, ఒక టెంట్ హౌస్ అతను వచ్చి, "అమ్మా నీకెందుకు భయం. పెళ్ళికి మొత్తం లైటింగ్, డైనింగ్, మిగతావి ఏవైనా నేను చూసుకుంటాను" అన్నారు. తర్వాత వంట చేసే అతను దానికి కావలసిన సమస్తం తానే సమకూర్చుకుంటానన్నారు. మిగతావి బజార్లో కొనుక్కొని వచ్చాము. చాలా మంది పెళ్లికి వచ్చారు. రాత్రి 11గంటలకు పెళ్లి, తెల్లవారేసరికి అమ్మాయి అత్తవారింటికి వెళ్ళిపోయింది. అంత ప్రశాంతంగా ఏ లోటూ లేకుండా నేను ఎవరిమీదా ఆధార పడకుండా చక్కగా పెళ్లి జరిగిపోయింది. ఇదంతా బాబా అనుగ్రహం కాక ఇంకేమిటి? పైగా ఆరోజు మాకెవ్వరికి తెలియని ఒక సాధువు వచ్చి భోజనం చేసి వెళ్లారు. నేను దూరంగా ఉండి చూసాను. వారు బాబావారే నని నా నమ్మకం. అక్కడినుండే వారికి నమస్కారం చేసుకున్నాను. ఆ విధంగా బాబా కృపతో మా అమ్మాయి పెళ్లి చేయగలిగాను.

అదేవిధంగా మా అబ్బాయికి మంచి ఉద్యోగం దొరికి, వివాహం జరిగింది. మా కోడలు కూడా మాతో పాటూ బాబా మార్గంలోనే ఉంటుంది. పిల్లాపాపలతో మా అమ్మాయి, అబ్బాయి, సుఖంగా ఉన్నారు. తరవాత పూజ్యశ్రీ అమ్మగారి దర్శన భాగ్యం, పూజ్యశ్రీ మాస్టరు గారి గ్రంథాల పరిచయం, గురు కుటుంబంతో అనుబంధం కలగడం ఇదంతా బాబా వారు మాకు కల్పించిన అపూర్వ అవకాశంగా భావిస్తున్నాము.

ప్రస్తుతం మేము దీప్తి శ్రీనగర్ లో నాంపల్లి బాబా మందిరం దగ్గరఉన్న కాలనీలో వుంటాము. మా కుటుంబం అంతా అక్కడి శిరిడీ బాబా మందిరంలో, నాంపల్లి బాబా మందిరం లో సేవ చేసుకుంటూ దర్శన భాగ్యాన్ని పొందుతున్నాము.

నడిసముద్రంలో ఉన్న నావ లాంటి జీవితాన్ని ఒక ఒడ్డుకు చేర్చి చక్కటి జీవితాన్ని ప్రసాదించిన సమర్థ సద్గురు సాయినాథునికి కృతజ్ఞతా పూర్వక నమస్సులు!!

# ఆచార్యుని అద్భుత లీలలు

**శ్రీ జానకిరామిరెడ్డి**

పూజ్యశ్రీ భరద్వాజ గురుదేవుల లీలావైభవాన్ని మీతాత్మకూరు వాస్తవ్యులు శ్రీ జానకిరామిరెడ్డిగారు ఈవిధంగా తెలియజేస్తున్నారు.

నాకు గూడూరుకు చెందిన హరిబాబుగారితో బాగా పరిచయముండేది. అతను ఎప్పుడూ పూజ్యశ్రీ మాస్టరుగారి గురించి చెప్తూ వుండేవాడు. కానీ నేను పెద్దగా పట్టించుకునేవాడిని కాదు. ఒకసారి నాకు శ్రీసాయిలీలామృతము గ్రంథమిచ్చి చదవమని చెప్పాడు. నేను, "ఎప్పుడూ ఇది చదువు, అది చదువు అని ఏదో ఒకటి చెప్తూవుంటావు. నేను చదవను!" అని గట్టిగా చెప్పాను. "సరే చదవకపోతే పోనీలే! రేపు కమలాబాయిగారి ఇంటికి అక్కల్కోటస్వామి పాదుకలు వస్తున్నాయి. ఒకసారి అక్కడికి రా, దర్శనం చేసుకుందువు గాని!" అని చెప్పాడు. నాకు ఇష్టం లేకపోయినా వెళ్లాను. అక్కడకు వెళ్ళాక ఆ స్వామి పాదుకలు బలవంతంగా నా నెత్తిమీద పెట్టాడు. అప్పుడు నేను, "బతికున్నవాళ్ళు నాలుగు తంతేనే నాకు బుద్ధి రాలేదు! ఈ చనిపోయినవాడి పాదుకలు నెత్తిన పెడితే నాకేంటి ఉపయోగం?" అని వెంటనే బండి మీద అక్కడినుంచి వచ్చేశాను.

నాకు బాగా తాగే అలవాటు వుండేది. నాకు వివాహమై ఇద్దరు పిల్లలు వున్నా బాధ్యత లేకుండా, నా అలవాట్లతో బాగా అందరినీ విసిగించేవాడిని. మా ఊరి దగ్గర కసుమూరు దర్గా వుంది. మావాళ్ళు తరచూ కసుమూరు వెళ్లి నా గురించి ప్రార్థన చేసేవారు.

ఆరోజు కూడా బాగా తాగి పడుకున్నాను. కసుమూరు బాబా నాకు స్వప్నంలో కనిపించి "ఏరా! బతికున్నవాడు తంతేనే బుద్ధి రాలేదు, చనిపోయినవాడి పాదుకలు నెత్తిన పెడితే ఏంటి ఉపయోగం అంటావా?" అన్నారు. నాకు మతిపోయింది. నేను అక్కడ అక్కల్కోట స్వామి గురించి అంటే, ఈరోజు ఈయన ఆ మాట చెప్పారేంటని ఆశ్చర్యపోయాను. నేను త్రాగిన తర్వాత బాగా అరుస్తూ వుంటాను. కానీ ఆరోజు పొట్ట ఉబ్బిపోయి, వాంతి, విరోచనం అయితే బాగుండుననుకుని, అవి రాక ఇబ్బందిపడుతున్నాను. అప్పుడు కసుమూరు బాబా స్వప్నంలో నన్ను హెచ్చరించినప్పుడు నా బాధ ఆయనకు చెప్పాను. "ఇప్పుడు అవుతుందిలే, వెళ్లు!" అన్నారు. వెంటనే నిద్ర లేచి పెరట్లోకి వెళ్ళగానే రెండూ అయిపోయాయి! అప్పటికి ఉదయం 5:00 అయింది. ఇక పడుకోకుండా వెంటనే స్నానం చేసి మొట్టమొదటిసారి గూడూరు బాబా గుడికి వెళ్ళాను. నేను బాబాకు నమస్కారం చేసుకొని, "అయ్యా! నేను ఈ చెడు అలవాట్లని నా అంతట నేను మానలేను, మీరే మార్చాలి!" అని నమస్కారం చేసుకున్నాను.

ఈ విషయం తర్వాత హరిబాబుకి చెప్తే, "ఇక నీకు తిరుగులేదు పో!" అని పూజ్యశ్రీ మాస్టరుగారు వ్రాసిన శ్రీగురుచరిత్ర గ్రంథం ఇచ్చాడు. వెంటనే అతని దగ్గరనుంచి



ఆ గ్రంథం తీసుకుని ఇంటికి వెళ్లి స్నానం చేసి సప్తాహ పారాయణ మొదలుపెట్టాను. నేనంత శ్రద్ధగా పారాయణ చేయడం హరిబాబు చూసి,"నువ్వు శిరిడి పోతావేమోలే!" అన్నాడు. నాకు అప్పట్లో ఆర్థిక ఇబ్బందులు చాలా ఎక్కువగా వుండేవి. 'శిరిడీకి వెళ్లాలంటే డబ్బులు నా దగ్గర లేవు కదా!' అని నవ్వుకున్నాను. గ్రంథం పూర్తయ్యే ముందు రోజున ఒక స్నేహితుడు నాతో, "నేను రేపు శిరిడీకి వెళ్తున్నాను, నువ్వు వస్తావా?" అని అడిగాడు! "నా దగ్గర డబ్బులు లేవు. నేను రాలేను" అన్నాను. "ఏమీ ఫరవాలేదు, నేను నిన్ను తీసుకెళ్తాలే!' అన్నాడు. గ్రంథం పూర్తిచేసి గూడూరు బాబా గుడిలో కొబ్బరికాయ వేసుకొని, శిరిడి ప్రయాణం సంగతి బాబాకు చెప్పుకొని వద్దామని వెళుతూ, నా భార్యను కూడా తీసుకెళ్ళాను. ఇద్దరం గుడికివెళ్లి వచ్చేటప్పుడు హరిబాబుతో శిరిడీకి వెళ్తున్నానని చెప్పాను. అప్పటికి వారం రోజుల నుంచి నేను తాగడం ఆపేసి పారాయణ చేస్తుంటే 'ఆ గ్రంథం ఎంత గొప్పదో కదా!' అని నా భార్యకు కృతజ్ఞత కలిగి, "నాకు కూడా శిరిడీ వెళ్లాలని వుంది" అని హరిబాబుతో చెప్పింది. అది విని ఆయన, "నువ్వు కూడా గ్రంథం చదవడం మొదలుపెట్టు, వెళ్తావేమోలే!" అన్నాడు. నాకు అప్పుడు కోపం వచ్చి, "చాల్లే! నన్నే ఒకరు డబ్బులు పెట్టి తీసుకెళ్తుంటే, ఆమెను ఎవరు తీసుకెళ్తారు?" అన్నాను. ఆమె ఇంటికి వెళ్లి స్నానం చేసి గ్రంథం చదవడం మొదలుపెట్టింది. కొంతసేపటికి మా స్నేహితుడు ఫోన్ చేసి, "ఇక్కడ నాతో పాటు చాలామంది శిరిడీకి వస్తామని అంటున్నారు. ఇప్పుడు అందరికీ టికెట్లు దొరకవు కదా! అందుకని మన టిక్కెట్లు రద్దు చేసి ఒక వాహనం మాట్లాడాను. మా ఇంట్లోవాళ్ళు కూడా వస్తున్నారు. మీ ఆవిడ కూడా వస్తే తీసుకురా! అందరం కలిసి శిరిడీకి వెళదాము" అని చెప్పాడు!

అలా మొట్టమొదటిసారి 2001, దీపావళి సమయంలో శిరిడీకి వెళ్ళాము. బాబా తలచుకుంటే ఏమైనా చేయగలరని మాకు అర్థమైంది. శిరిడీ నుంచి వచ్చాక శ్రీసాయిలీలామృతము, శ్రీ గురుచరిత్ర గ్రంథాలు ప్రతిరోజూ పారాయణ మొదలుపెట్టాము.

మా పెద్దబ్బాయి పదవ తరగతి తరువాత కళాశాలలో చేర్చడానికి నా దగ్గర డబ్బులు లేక ఆలోచిస్తున్నాను. ఒకరోజు పూజ్యశ్రీ మాస్టరుగారు గళ్ళ లుంగీ, తెల్ల బనీను వేసుకొని స్వప్నదర్శనమిచ్చారు. ఆయన తమతో నన్ను, నా పిల్లలిద్దరినీ తిరుపతికి వెళ్లే రైలు ఎక్కించి మమ్మల్ని తిరుపతిలో దించి తిరిగి వచ్చేశారు. ఆ స్వప్నం అర్థం కాక హరిబాబుని అడిగాను. "అయితే తిరుపతిలో మీ సమస్యకు పరిష్కారం ఏదో వుండి వుంటుంది!" అని చెప్పి హరిబాబు నన్ను తిరుపతి తీసుకెళ్లాడు కానీ అక్కడ నాకేమీ పరిష్కారం దొరకలేదు.

పెద్దబ్బాయి చదువు లేక అలాగే వుండిపోయాడు. మా చిన్నబ్బాయి కూడా చదువు మధ్యలో ఆపి వచ్చేసి చాలా ఇబ్బంది పెట్టేవాడు. దానికి తోడు ఆర్థిక ఇబ్బందులు. ఇక నాకు జీవితం మీద విసుగు పుట్టి చనిపోవాలని నిర్ణయించుకుని, చనిపోయే ముందు పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధి మందిరం ఒకసారి దర్శనం చేసుకుందామని ఇంట్లో చెప్పకుండా ఒంగోలు వచ్చాను. అక్కడికి వెళ్లి నా నిర్ణయం వారికి చెప్పి నమస్కారం చేసుకొని, ఎదురుగా వున్న లాడ్జిలో మడత మంచం తీసుకొని రాత్రి పడుకునేవాడిని. పొద్దున్న

సమాధి మందిరంలోనే ప్రసాదం పెడితే తినేవాడిని. అలా మూడు రోజులు గడిచిపోయాయి. ఇంట్లో వాళ్ళు కంగారు పడతారని ఎదురుగా వున్న టెలిఫోన్ బూత్ కు వెళ్లి ఇంటికి ఫోను చేసి ఒంగోలు వచ్చానని చెప్పాను. నా ఉద్దేశం మాత్రం ఇంట్లోవాళ్ళకి చెప్పలేదు.

అక్కడే ఒక చిత్రం జరిగింది. ఆ టెలిఫోన్ బూత్ లో ఒక పెద్దావిడ కూర్చుని వుంది. ఆమెకు నేను ఎవరో తెలియదు, నాకు ఆమె ఎవరో తెలియదు. కానీ ఆమె, "ఏందన్నా అట్లా వున్నావు?' అని అడిగింది. "ఏం లేదమ్మా! ఏవో బాధలు!" అన్నాను. " నా దగ్గర అమ్మగారి ఫోన్ నెంబర్ వుంది. నువ్వు వారికి ఫోన్ చెయ్యి! నీ బాధలు అన్నీ పోతాయి!" అన్నది. అప్పటివరకూ పూజ్యశ్రీ అమ్మగారిని నేనెప్పుడూ చూడలేదు. వారితో ఎలా మాట్లాడాలో కూడా తెలియదు. ఆవిడ మాట కాదనలేక అప్పుడే నెంబరు తీసుకుని ఫోను చేశాను. పూజ్యశ్రీ అమ్మగారు వెంటనే ఫోను తీశారు! వారి గొంతు వినగానే నా మనస్సు పులకించింది. వారికి నా సమస్యలు వివరించి, నేను పూజ్యశ్రీ మాస్టరుగారి దర్శనం చేసుకుని ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నానని చెప్పాను. అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు, "నువ్వు అలా ఆత్మహత్య చేసుకోనవసరం లేదు. నీకు పూజ్యశ్రీ మాస్టరుగారి ఆశీస్సులు, అనుగ్రహం వున్నాయి. నీకు ఆహారంలో ఇష్టమైన పదార్థం బాబాకు వదిలేసి, శ్రీ సాయి లీలామృతము పారాయణ చేయి. అన్ని సమస్యలూ పరిష్కారమవుతాయి" అని చెప్పారు. అప్పుడు నేను, "అమ్మా! నాకు చేపలు, మాంసం అంటే చాలా ఇష్టం. అవి లేకుండా నేను వుండలేను. నా ప్రయత్నంతో వదలలేను, మీ ఆశీస్సులు వుంటేనే మానగలనేమో!" అని చెప్పాను. అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు, "ఏం కాదులే! నువ్వు మానుకోగలవు. వాటిని వదిలేసి పారాయణ మొదలుపెట్టు!" అని చెప్పారు. అప్పటినుంచి వాటిని వదిలేసి పారాయణ చేయడం మొదలుపెట్టాను. నేను నా ఆత్మహత్య ఆలోచన విరమించుకున్నాను. సమస్యలు పరిష్కారమై జీవితం కొంత కుదుటపడినా, ఇప్పటికి 20 సంవత్సరాలుగా వాటిని మళ్లీ నేను ముట్టుకోలేదు! కష్టం తీరాక తినవచ్చు అని చెప్పినా, నాలో ఇంత మార్పు తీసుకువచ్చినందుకు కృతజ్ఞతగా వాటిని తినడం మానేశాను. అదంతా పూజ్యశ్రీ మాస్టరుగారి అనుగ్రహం, పూజ్యశ్రీ అమ్మగారి ఆశీస్సుల బలం!!

తర్వాత తిరుపతి విద్యాపీఠంలో హరిబాబుకి తెలిసిన ప్రొఫెసర్ చంద్రశేఖర్ గారి ద్వారా ముందు మా పెద్దబ్బాయిని, తరువాత చిన్నబ్బాయిని చేర్చి చదువులు కొనసాగించాను. వారిద్దరూ చక్కగా చదువుకుని జీవితాల్లో హాయిగా స్థిరపడ్డారు. పూజ్యశ్రీ మాస్టరుగారు మొట్టమొదటిసారి స్వప్నదర్శనం ఇచ్చినప్పటినుంచి నేను ఎక్కువగా విద్యానగర్ వెళ్లడం మొదలుపెట్టాను. పూజ్యశ్రీ అమ్మగారిని హైదరాబాదులో పలుమార్లు దర్శనం చేసుకున్నాను.

పెద్దబ్బాయి వివాహవిషయంలో కొంచెం సమస్యలు వచ్చాయి. అప్పుడు మరలా పూజ్యశ్రీ మాస్టరుగారు నాకు స్వప్నదర్శనం ఇచ్చారు. ఆ స్వప్నంలో ఒంగోలులో పూజ్యశ్రీ మాస్టరుగారు ఒక ఇంట్లో వున్నారు. ఆ ఇంటి ముందు పూల తోట వుంది. వారు నడుముపై చేయిపెట్టుకొని మొక్కలకు నీళ్లు పోస్తున్నారు. నేను వెళ్లి సమస్య చెబితే వారు, "అసలు నువ్వు ఏమీ ఆలోచించే పనిలేదు. అందరూ బాగుంటారు. నువ్వు హాయిగా వుండు!" అని చెప్పారు. అలాగే పూజ్యశ్రీ మాస్టరుగారి దయవల్ల పిల్లలిద్దరికీ వివాహమై అందరమూ హాయిగా వున్నాము. వాళ్ళు మంచి ఉద్యోగాలు వచ్చి బెంగళూరులో స్థిరపడ్డారు. మేము ఎన్నో తీర్థయాత్రలు చేశాము. దత్తక్షేత్రాలకు వెళ్లాము. ఇప్పుడు ఇంటిల్లిపాది.... అంటే నేను, నా భార్య, కొడుకులు, కోడళ్ళు అందరమూ పారాయణ చేస్తాము. నేను మారడం చూసి మా ఊర్లో చాలామంది పారాయణ మొదలుపెట్టారు.

వెనక్కి తిరిగి నా జీవితాన్ని చూసుకుంటే చాలా ఆశ్చర్యంగా వుంటుంది. ఎందుకూ పనికిరానివాడిని నిలబెట్టి, నాకు ఇంత అదృష్టాన్ని కల్పించారు. పూజ్యశ్రీ మాస్టరుగారు నా కోసమే ఈ భూమి మీదకు వచ్చారనిపిస్తుంది. వారి గురించి ఎంత చెప్పినా తక్కువే! మనస్ఫూర్తిగా వారి పాదపద్మములకు ప్రణామాలర్పిస్తున్నాను. ●

# పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే
# రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

**SRI GURUPADUKA PUBLICATIONS, C/o. SRI MANGA BHARADWAJA TRUST**
Regd. Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole,Hyderabad - 500068, Phone: +91 7416041550
Branch Office : Kondalah Bunk Street, Kothapeta, Ongole, Prakasam Dist. Andhra Pradesh. Phone: 8597233271
*Send DD in favour of 'Sri Manga Bharadwaja Trust (Publications)' Payable at Hyderabad or Ongole*

### శ్రీ గురుని పై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ గురు చరిత్ర – శ్రీ సాయి లీలామృతము (బౌండ్) | ₹499.00 |
| శ్రీ గురు చరిత్ర | ₹199.00 |
| శ్రీ సంహితాయన గురు ద్విసాహస్రి | ₹149.00 |
| శ్రీ దత్తావతార మహాత్మ్యము | ₹75.00 |

### శ్రీ శిరిడీ సాయిబాబాపై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ సాయి లీలామృతము | ₹199.00 |
| శ్రీ సాయి సన్నిధి | ₹199.00 |
| శ్రీ సాయినాథ ప్రబోధామృతము. | ₹119.00 |
| శ్రీ సాయినాథ పూజ | ₹49.00 |
| శిరిడీ హారతులు | ₹15.00 |
| శిరిడీ క్షేత్ర సందర్శనము | ₹49.00 |
| శ్రీ సాయినాథ స్తవన మంజరి | ₹10.00 |
| సాయిని పూజించడం ఎందుకు? | ₹10.00 |
| సత్సంగము – భజన | ₹10.00 |
| సాయి సూక్తి – ఆచార్యవాణి | ₹20.00 |
| శ్రీ సాయి నిత్య సత్య వ్రతము<br>(రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹20.00 |

### ఇతర మహాత్ముల గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ  స్వామి సమర్థ | ₹75.00 |
| శ్రీ తాజుద్దీన్ బాబా | ₹75.00 |
| అవధూత శ్రీ వెంకయ్య స్వామి | ₹99.00 |
| అవధూత శ్రీ చీరాల స్వామి | ₹75.00 |
| శ్రీ పాకలపాటి గురువుగారు | ₹75.00 |
| శ్రీ ఆనందమయి అమ్మ | ₹75.00 |
| టిబెట్ యోగి మిలారేపా చరిత్ర | ₹99.00 |
| శ్రీ గురు సిద్ధారూఢ స్వామి<br>(రచన : శ్రీమతి శారదా వివేక్) | ₹99.00 |
| అవధూత శ్రీ చివటం అమ్మ<br>(రచన : శ్రీమతి శారదా వివేక్) | ₹99.00 |

### అన్వేషణాత్మకమైన వైజ్ఞానిక గ్రంథములు

| | |
|---|---|
| ఏది నిజం? | ₹49.00 |
| మతం ఎందుకు? | ₹49.00 |
| విజ్ఞాన వీచికలు | ₹99.00 |
| పరిప్రశ్న | ₹119.00 |

### ధ్యాన సంబంధమైన గ్రంథములు

| | |
|---|---|
| ధ్యానయోగ సర్వస్వము | ₹99.00 |
| బుద్ధ ధ్యాన హృదయము | ₹49.00 |

### ఆధ్యాత్మికత – తత్వచింతనా పూర్వక గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు | ₹199.00 |
| ఆధ్యాత్మిక జాగృతి<br>(రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹199.00 |

### ఇతర గ్రంథములు

| | |
|---|---|
| పురుషసూక్త రహస్యము | ₹49.00 |
| మనము – మన సంస్కృతి | ₹75.00 |

### పూజ్య భరద్వాజ గురుదేవులపై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| మహాత్ముల ముద్దుబిడ్డడు<br>(రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹149.00 |
| భగవాన్ శ్రీ భరద్వాజ<br>(రచన : శ్రీమతి శ్రీదేవి) | ₹299.00 |
| మహా పురుషుడు<br>(రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹60.00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు –1<br>(సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | ₹199.00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు –2<br>(సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | ₹199.00 |
| ఆచార్య అమృత లేఖావళి<br>(సంకలనం : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹199.00 |
| మరో నంద దీపం | ₹120.00 |
| మాస్టారు అమృత వాక్కులు<br>(రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹99.00 |

### బాలల కొరకు విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| బాలల సాయి లీలామృతము<br>(రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹49.00 |
| బాలల సాయిసన్నిధి<br>(రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹75.00 |
| బాలల శ్రీ గురు చరిత్ర<br>(రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹75.00 |

### BOOKS IN ENGLISH

| | |
|---|---|
| Sai Baba The Master | ₹249.00 |
| Shri Guru Charitra | ₹149.00 |
| Supreme Master | ₹149.00 |
| Tajuddin Baba | ₹149.00 |
| Sai Baba and His Teachings | ₹149.00 |
| Children's Sai Baba The Master<br>*(Author: Smt. Adidam Vedavati)* | ₹80.00 |

### BOOKS IN OTHER LANGUAGES

| | |
|---|---|
| Sadguru Sri Sai Baba (Hindi) | ₹249.00 |
| Sri Guru Charitra (Hindi) | ₹249.00 |
| Sri Sai Leelamruthamu (Kannada) | ₹249.00 |
| Sri Sainatha Prabodhamruthamu (Kannada) | ₹149.00 |
| Sri Guru Charitra (Kannada) | ₹199.00 |
| Sri Sai Sannidhi (Kannada) | ₹249.00 |
| Tibet Yogi Milarepa Charitra (Kannada) | ₹119.00 |
| Sri Swami Samartha (Kannada) | ₹119.00 |
| Sri Sai Leelamruthamu (Tamil) | ₹249.00 |
| Sri Guru Charitra (Tamil) | ₹299.00 |
| Sri Shirdi Sai Aartulu (Tamil) | ₹29.00 |
| Sri Sainatha Stavana Manjari (Tamil) | ₹20.00 |
| Sri Sai Leelamruthamu (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Odiya) | ₹299.00 |
| Sri Sai Sannidhi (Odiya) | ₹249.00 |



జూలై 10, 2025 గురువారం నాడు గురుపూర్ణిమ పండుగ శ్రీ అలివేలు మంగమ్మ దివ్య సన్నిధానము, గుమ్మళంపాడులో వైభవంగా జరిగింది. గురుపుత్రిక శ్రీమతి అడిదం వేదవతిగారు మాతృదేవి సన్నిధిలో విశేషపూజ, సత్సంగము చేశారు. భక్తులందరూ ఆనందోత్సాహాలతోను, భక్తిశ్రద్ధలతోనూ ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు.

Date of Publication: 21st of each month. Permitted to post: 23rd, 24th, 25th and 26th of each month.
Printed and published by Dr. R.S. Sasidhar on behalf of E. Vikramaditya and printed at Vanaja Printers, Vijayawada and published at Sri Manga Bharadwaja Trust, Ongole (523002) - Editor: Dr. R.S. Sasidhar.
Postal Registration Number : Prakasam/16/2024-2026, Regd.No. 37926/83.



# శ్రీ ఆనందమయి అమ్మ ఆరాధన

ఆగస్టు 27, 2025